
కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వాహన డ్రైవర్లు (ఫైల్)

పారిశుధ్యం మెరుగు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)ను తెచ్చి సొంతవారికి లబ్ధి చేకూర్చింది. క్లీన్‌గా దోచిపెట్టింది. అప్పటి సీఎం సామాజిక వర్గానికి చెందిన రెడ్డి అండ్ రెడ్డి ఏజెన్సీకి చెత్త సేకరణ బాధ్యతలు అప్పగించి అప్పనంగా రూ.కోట్లు కుమ్మరించింది. నగర జనం నెత్తిన చెత్తపన్ను భారం మోపి ఆ మొత్తాన్ని సదరు ఏజెన్సీకి చెల్లించింది. అయితే ఆ సంస్థ నిర్వాహకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. తొలుత నగరంలో చెత్తసేకరణకు 60 వాహనాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణను గాలికొదిలేశాడు. దీంతో అత్యధికం మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. డ్రైవర్‌లకు నెలకు రూ.12 వేల వేతనం అంటూ పనిలోకి పెట్టుకుని రూ.9వేలు చెల్లిస్తూ వారి శ్రమను దోచేశారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు ప్రజల నుంచి నెల నెలా పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.38లక్షలను సదరు ఏజెన్సీకి చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటింటి చెత్త పన్ను వసూళ్లు నిలిపివేసింది. వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, ఇతరత్రా వ్యాపార దుకాణాల నుంచి పన్ను వసూలు మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. ఎక్కువ వాహనాలు తిరగకపోయినా, ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించకపోయినా నెల నెలా చెత్తపన్ను ద్వారా వచ్చిన మొత్తాన్ని అధికారులు ఇప్పటికీ సదరు ఏజెన్సీకి ముట్టజెప్తుండటం విమర్శలకు తావిస్తోంది.


కార్పొరేషన్ కార్యాలయంలో నిలిచిన చెత్త తరలించే వాహనాలు

క్లీన్‌గా దోపిడీ

సొంత వారికి బాధ్యతలు

క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఇంటింటి నుంచి చెత్త సేకరణను గత ప్రభుత్వం చేపట్టింది. అంతకుముందు ఎప్పుడూ లేని విధంగా చెత్తపై పన్ను విధించి ప్రజలపై ఆర్థికభారం మోపింది. బడి, గుడి, ఇల్లు, వాకిలి, హోటళ్లు, లాడ్జిలు, ఆసుపత్రులు, అన్నదాన సత్రాలు ఇలా ఒకటేమిటి ప్రతి దాని నుంచీ చెత్తపన్ను వసూలు చేసింది. చెత్తసేకరణ బాధ్యతను సీఎం సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఏజెన్సీకి అప్పగించింది. ఒప్పందం ప్రకారం సదరు ఏజెన్సీ వాహనాలను సమకూర్చుకొని ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉంటుంది. అందుకోసం డ్రైవర్‌ను నియమించుకోవాలి. ఆయనే అన్ని పనులూ చేయాలి. కానీ ఒంగోలులో కార్పొరేషన్ అధికారులు ఏజెన్సీకి అన్ని విధాలా సహకరించారు. చెత్తసేకరణ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ సిబ్బందిని కేటాయించడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది.

- వైసీపీ పాలనలో క్లాప్ పేరుతో రూ.కోట్లు కైంకర్యం
- మాజీ సీఎం జగన్ సామాజికవర్గానికి చెందిన సంస్థకు చెత్తసేకరణ బాధ్యతలు
- దానికి లబ్ధి చేకూర్చేందుకు ప్రజల నెత్తిన పన్ను భారం
- మరమ్మతులకు గురై మూలనపడిన వాహనాలు
- పట్టించుకోని ఏజెన్సీ
- సిబ్బంది వేతనాల్లోనూ కోత
- నగర వాసులకు తీరని చెత్త కష్టాలు
- అయినా ఏజెన్సీకి నెలకు రూ.25లక్షలు చెల్లిస్తున్న కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 4 : గత వైసీపీ పాలనంతా అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లు సాగింది. పార్టీ నేతలకు ప్రజాధనాన్ని దోచిపెట్టడమే ధ్యేయం అన్నట్లు నడిచింది. చివరికి చెత్త సేకరణనూ సొంత వారికి ఆదాయమార్గంగా మార్చింది. క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అంటూ ప్రజలపై పన్నుల భారం మోపి ఆ సొమ్మును పందేరం చేసింది. ఒంగోలు నగర పాలక సంస్థలో క్లాప్ తీరును పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 2022 మార్చి నుంచి ఈ కార్యక్రమం అమల్లోకి వచ్చింది. అయితే అప్పటి నుంచి పారిశుధ్యం మెరుగు అటుంచితే భారీగా నిధుల మేత జరిగినట్లు స్పష్టమవుతోంది.

కదల్లేక కార్పొరేషన్ కార్యాలయంలో వాహనాలు

డ్రైవర్లకు వేతనాలు, వాహనాల నిర్వహణ, వాటి మరమ్మతులు, టైర్లు, ఇంజన్ ఆయిల్, క్లచ్ ప్లేట్‌లు, ఇతర మెయింటినెన్స్. రెడ్డి ఏజెన్సీనే చూసుకోవాలి. కానీ ఆరంభంలో 60 వాహనాలను ఏర్పాటు చేసిన ఆ సంస్థ ఆ తర్వాత వాటి గురించి అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా కొద్దిరోజులు ఆయిల్‌కు కూడా డబ్బులు ఇవ్వలేదు. ప్రస్తుతం వాహనాల్లో దాదాపు 40కిపైగా మరమ్మతులకు గురై కనీసం కదలలేని స్థితిలో కార్పొరేషన్ కార్యాలయానికే పరిమితమయ్యాయి. మరికొన్ని మూలుగుతూ, ముక్కుతూ రోడ్డెక్కుతున్నాయి. అయితే వాటి నిర్వహణ బాధ్యతపై అధికారులకు ఎలాంటి సంబంధం లేకపోవడంతో నగర పాలక సంస్థ నిధుల నుంచి ఖర్చు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు వాహన డ్రైవర్లే వాటికి మరమ్మతులు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నెలకు తమకు వచ్చే రూ.9వేల వేతనంలో రెండు, మూడు వేలు రిపేరుకే ఖర్చవుతున్నదని, ఇక తాము తినేది ఏమిటని డ్రైవర్లు వాపోతున్నారు. దీంతో కొందరు వాహనాలు నడపలేమంటూ కార్పొరేషన్‌లో వదిలేయగా, మరికొన్నింటిని అధికారులు జోక్యంతో ఎలాగోలా తిప్పుతున్నారు.

వాహన డ్రైవర్లకు మొండిచెయ్యి

పారిశుధ్యం పేరుతో చెత్తసేకరణ వాహనాలకు డ్రైవర్లుగా విధుల్లోకి తీసుకున్న వారి సంక్షేమాన్ని ప్రైవేటు సంస్థ విస్మరించింది. క్లాప్ కింద విధుల్లోకి తీసుకున్న వారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాదు. అలాగని కాంట్రాక్ట్ కార్మికులూ కాదు. రోజువారీ కూలీలుగా తీసుకుని వారికి వర్తించాల్సిన కార్మిక చట్టాలను ఏజెన్సీ తుంగలో తొక్కింది. వారికి ఎలాంటి సౌకర్యాలు లేకుండా చేసింది. క్లాప్ పేరుతో కోట్ల రూపాయలు దండుకున్న సంస్థ అటు వాహనాల నిర్వహణ, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం గత వైసీపీ పాలనలో అడ్డగోలు తీరుకు అద్దం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ చెత్తపన్ను వసూళ్లను నిలిపివేసింది. కేవలం హోటళ్లు, ఆసుపత్రులు, లాడ్జిలు, ఇతరత్రా వాణిజ్య వ్యాపార సంస్థల నుంచి మాత్రమే పన్ను వసూలు చేస్తున్నారు. ఏజెన్సీ ఏర్పాటు చేసిన వాహనాల్లో అత్యధికంగా మరమ్మతులకు గురవడంతో నగరంలో చెత్తసేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. అయినా అధికారులు సదరు ఏజెన్సీని కొనసాగించడం, నెలనెలా వసూలు చేస్తున్న పన్నును ఆ సంస్థకు చెల్లించడం ఆరోపణలకు తావిస్తోంది.



వాహన దుస్థితి ఇలా...

నేడు కలెక్టర్ల సదస్సు

భవిష్యత్‌పై దిశానిర్దేశం చేయనున్న సీఎం

జిల్లా అంశాలపై నివేదికలతో హాజరవుతున్న అన్సారియా

ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి జిల్లా కలెక్టర్ల సదస్సును సోమవారం నిర్వహిస్తోంది. సాధారణంగా రెండు రోజులు నిర్వహించే ఈ సమావేశాన్ని ఈసారి ఒక్క రోజుకే పరిమితం చేశారు. ఉదయం 10 నుంచి నుంచి రాత్రి 8గంటల వరకూ నిరాటంకంగా సాగేలా షెడ్యూల్‌ను రూపొందించారు. అమరావతిలోని సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చే అంశాలు, విభిన్నవర్గాల ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, జిల్లాల వారీ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానమైన వ్యవసాయం, నీటి పారుదల, సహజవనరులు, పట్టణ, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, మానవ వనరుల అభివృద్ధి, సంక్షేమం వైద్యం తదితర తొమ్మిది రంగాలకు సంబంధించి 28 శాఖలపై సమీక్షించేలా అజెండా రూపొందించారు. రాత్రి ముగింపు సమయంలో శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఆమేరకు ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఆయా రంగాలు, శాఖల వారీ సమగ్ర నివేదికలను రూపొందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం సమావేశంలో అందజేయనున్నారు. జిల్లాకు కలెక్టర్‌గా కొద్దిరోజుల క్రితమే వచ్చిన ఆమె.. ఆయా రంగాలు, శాఖల వారీ ఒకవైపు సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలలో పలు అంశాలను గుర్తించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. రాత్రి ముగింపు సమయంలో శాంతిభద్రతలపై జరిగే సమీక్షకు ఎస్పీ దామోదర్ కూడా హాజరుకానున్నారు.

టీచర్లకు 8 వరకూ సెలవుల్లేవు!

పాఠశాల విద్య కమిషనర్ ఆదేశం

ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

ఒంగోలు (విద్య),ఆగస్టు 4 : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికల నేపథ్యంలో ఈనెల 8 వరకూ ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయవద్దని పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్ఎంసీ ఎన్నికలకు ఈనెల 1న నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి అదేరోజు వాటిని పరిష్కరించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఈనెల 8న ఎన్నికలు నిర్వహిస్తారు. మొదట ఎస్ఎంసీ సభ్యులను ఎన్నుకుంటారు. వారు తమలో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని వైస్‌ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆతర్వాత కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ప్రధానోపాధ్యాయుడే నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలు ముగిసే వరకు టీచర్లకు సాధారణ, ఇతర సెలవులు ఏవీ మంజూరు చేయవద్దని కమిషనర్ ఆదేశించారు.

పోకిరీల పనిపట్టారు!

ఒంగోలులో బాలికను వేధించిన ఇద్దరు యువకులు

స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ దామోదర్

తాలూకా పోలీసుల అదుపులో నిందితులు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 4 : బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులను ఉపేక్షించేది లేదని బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే హెచ్చరించిన ఎస్పీ దామోదర్ ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కేసులపై ఆయన వెంటనే స్పందిస్తున్నారు. స్వయంగా రంగంలోకి కూడా దిగుతున్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో మైనర్ బాలిక నూడిల్స్ తెచ్చుకునేందుకు వెళుతుండగా ఇద్దరు పోకిరీలు ఫూటుగా మద్యం సేవించి బైక్‌పై వెంటపడ్డారు. ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించారు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బయటకు వచ్చి కాపాడారు. అదేసమయంలో ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో నేరుగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులను విచారించారు. అదేసమయంలో అక్కడికి వచ్చిన తాలూకా పోలీసులు నిందితులైన చంద్రయ్యనగర్‌కు చెందిన ఎడ్లూరి జయదీప్, ఎర్రగుంట్ల అనూక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఇద్దరు యువకులపై రౌడీషీట్లు తెరుస్తామని చెప్పారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీలు, గంజాయి బ్యాచ్‌పై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎన్‌జీవో కాలనీలో పోలీసు గస్తీ పెంచుతామని స్థానికులకు తెలిపారు. మరోవైపు ఇద్దరు యువకులకు స్టేషన్‌లో పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకు ఎస్పీ ఒంగోలులోని దిశ పోలీసు స్టేషన్ తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో ఓ మహిళ ఆయన్ను కలిసి తన కుమార్తెను ఓ యువకుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన తన భర్తపై ఆ యువకుడు స్నేహితుడితో కలిసి దాడి కూడా చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే ఎస్పీ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.


సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను విచారిస్తున్న ఎస్పీ దామోదర్

పల్లెలకు కొత్తరూపు

నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం

చర్యలు చేపట్టిన కూటమి ప్రభుత్వం

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

అందుకోసం కార్యాచరణ

పర్యవేక్షణకు కమిటీలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 4 : వైసీపీ పాలనలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిధులు, విధులు లేక కునారిల్లుతున్న పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోంది. గ్రామీణ ప్రాంతాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న సీఎం చంద్రబాబు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం మింగేసింది. గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. చెత్తను కూడా తొలగించేందుకు నిధులు లేక పాలకవర్గాలు అలాగే వదిలేశాయి. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు కోసం దిశానిర్దేశం చేశారు.




నెలరోజులు నిత్యం పారిశుధ్య పనులు

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజానీకం అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. నెలరోజులపాటు గ్రామపంచాయతీల్లో రోజువారీ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా జిల్లాలో యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముందుగా గ్రామాల్లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. మరోవైపు మంచినీటి ట్యాంకులను కడిగించడం, బోరింగ్‌ల వద్ద శుభ్రత పాటించడం తోపాటు కాలువలు శుభ్రం వంటి చర్యలు తీసుకున్నారు.

గ్రామం నుంచే కమిటీలు

పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ కోసం గ్రామపంచాయతీ నుంచి జిల్లాస్థాయి పంచాయతీ అధికారి కార్యాలయం వరకు ప్రత్యేక కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాస్థాయిలో పంచాయతీ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే విధంగా ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు గ్రామస్థాయిలో జరిగే పారిశుధ్యం ఇతర పనులను రాష్ట్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో చేసే పనులను ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. తద్వారా జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ ప్రక్రియను పరిశీలించి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.


నిండుగా సాగర్

నిండుకుండలా శ్రీశైలం, అదేస్థాయిలో సాగర్ డ్యాం

ఇప్పటికే సాగర్ జోన్-1కు నీటి విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

నేడు గేట్లు ఎత్తే అవకాశం

ఉమ్మడి జిల్లాలో 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు

ఆశాజలం



ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు ప్రధాన వనరుగా ఉన్న సాగర్ నీటి సరఫరాపై రైతులు ఆశతో ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడిచినా సరైన వర్షాలు లేక పంటల సాగు ముందుకు కదలలేదు. సాధారణ సాగు విస్తీర్ణంలో 20శాతం కూడా ఇంకా విత్తనం పడలేదు. అంతే కాక ఎండల తీవ్రత పెరిగి వేసవిని తలపిస్తుండటంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో కృష్ణానది పరవళ్లు భరోసా కలిగించాయి. పది రోజుల్లోనే శ్రీశైలం జలాశయం నిండటంతోపాటు సాగర్ డ్యాం కూడా నిండిపోయే పరిస్థితికి రావడం ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో సాగుపై రైతుల్లో నమ్మకం పెంచింది.

సాగు, తాగుకు సాగర్ నీరే ప్రధాన ఆధారం

ఉమ్మడి జిల్లాలోని సాగర్ కాలువల పరిధిలో సుమారు 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా నీరు అందితే సగం విస్తీర్ణంలో మాగాణి, మిగిలిన దానిలో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఆరుతడిలో ప్రధానంగా మిర్చి, మొక్కజొన్న వంటివి ఉండగా వర్షాధారంగా వేసే శనగ, పొగాకు, పత్తి పంటలకు ఆ నీటిని పెట్టుకుంటారు. తద్వారా పంటలతోపాటు పాడి పరిశ్రమకు సాగర్ నీరు ఉపకరిస్తుంది. అలాగే అత్యధిక ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా సాగర్ నీటితోనే తీరుతుంది. అయితే గత ఏడాది కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వర్షాలు లేక సాగర్ డ్యాం నిండక ఆయకట్టుకు నీరు రాలేదు. మాగాణి ప్రాంతంలో ఏపంటా సాగు చేసే వీలు లేక బీళ్లుగా వదిలేశారు. ఆరుతడి భూముల్లో వర్షాధారంతో కొంత మేర సాగు చేశారు. తాగు నీటికి కూడా సక్రమంగా నీరందించిన పరిస్థితి లేదు.

576 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

ఈ ఏడాది తొలకరిలో కాస్తంత మెరుగ్గా వర్షం కురిసినప్పటికీ అనంతరం బెట్ట వాతావరణం కొనసాగింది. దీంతో ఖరీఫ్ ముందుకు సాగలేదు. సీజన్ ప్రారంభమై రెండు మాసాలు పూర్తయినా సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లలో కేవలం 16.80శాతంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. రైతులు భవిష్యత్ పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో కృష్ణా ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. గతంతో పోల్చుకుంటే దాదాపు నెల రోజులు ముందుగానే శ్రీశైలంకు వరద నీరు రాక ఆరంభమై వారం క్రితమే గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతుండగా సాగర్ డ్యాం కూడా నిండుతోంది. ప్రస్తుత పరిస్థితిని చూస్తే శ్రీశైలం డ్యాం నీటి మట్టం 885 అడుగులు, నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 883 అడుగులకు నీటిమట్టం చేరి 204 టీఎంసీలు నిల్వ ఉంది. సుమారు 4.02 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తుండగా పది గేట్లు ఎత్తి మొత్తం దిగువకు వదులుతున్నారు. ఇక సాగర్ డ్యాం నీటి మట్టం 590 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి మట్టం 576 అడుగులు, నిల్వ 264 టీఎంసీలుగా ఉంది. ఎగువ నుంచి 3.15 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుండగా సోమవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది. దీంతో సోమవారం సాయంత్రం సాగర్ గేట్లను కూడా ఎత్తే అవకాశం ఉంది.

ముందస్తుగానే సాగు నీరు

తొలుత ఆగస్టు ఆఖరుకు సాగర్ కుడి కాలువ పరిధిలో జోన్-1కు, సెప్టెంబరు 15నుంచి జోన్2 (ఉమ్మడి ప్రకాశం జిల్లా) ప్రాంతానికి సాగు నీటిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో సాగుకు 57, తాగునీటికి 12 కలిపి 69 టీఎంసీలు అవసరంగా జిల్లా అధికారులు అంచనా వేశారు. కాగా దాదాపు నెల రోజులు ముందుగానే డ్యాంలు నిండటంతో జోన్-1కు తక్షణం నీటిని విడుదల చేసేలా ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మరో 15 రోజుల్లోపుగానే జిల్లాకు కూడా నీరు రానుంది. సాగర్‌డ్యాం నిండి గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో ఇంకా ముందుగా కూడా నీరు కాలువలకు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సాగర్ నీటిపై పూర్తి ఆశతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.


ఆదివారం సాగర్ నీటి మట్టం

చర్చిని ప్రారంభించిన మంత్రి



చర్చిని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి(కొండపి), ఆగస్టు 4 : మండలంలోని కామేపల్లి అగ్రహారంలో నిర్మించిన చర్చిని మంత్రి స్వామి ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలు టీడీపీకూటమికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మ, పోలేరమ్మ ఆలయంలో పూజలు

మండలంలోని చతుకుపాడు గ్రామంలో గంగమ్మ, పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా మహిళలు ఆదివారం ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని అమ్మవార్లకు టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, నాయకులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, కొమ్మాటపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 4: పెద్దకొత్తపల్లి రోడ్డు దగ్గర స్కూటీ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం జరిగింది. లారీ అతివేగంగా రావటంతో స్కూటీపై ఒంగోలు నుంచి స్కూటీపై వెళ్తున్న అద్దంకికి చెందిన ఎస్.సుబ్బమ్మ, ఆర్.అరుణలు కిందపడి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మొక్కలు నాటుతున్న నిర్వాహకులు

మద్దిపాడు, ఆగస్టు 4: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం మల్లవరంలోని శ్రీవనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కావూరి వాసు, మార్నేని కృష్ణారావు, బోయపాటి రవి, ముప్పవరపు ధనలక్ష్మి, కళ్యాణకట్ట నిర్మాణ దాతలు అడ్డాల రమణమ్మ, బోయపాటి సూర్యమ్మ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి జనసేనలో చేరిక



జనసేన పార్టీలో చేరిన నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 4: ఈదుమూడికి చెందిన పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరరావు, సమక్షంలో ఆదివారం రాత్రి ఈదుమూడి ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు ముంగర పవన్‌కుమార్, కొమ్మూరి చంద్రా, ఇంటూరి రాజేష్, ముంగర రాజేష్‌తో పాటు మరో 20 మంది జనసేన పార్టీలో చేరారు. వారందరికి కోటేశ్వరరావు కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. వారందరికీ సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్రా అనీల్, నడికుడి వెంకట్, మల్లెపూల శివ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత పనులు

టంగుటూరు, ఆగస్టు 4 : టంగుటూరు పంచాయతీ పరిధిలోని సైడ్ డ్రెయిన్స్ శుభ్రం చేసే పనులు మొదలయ్యాయి. పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యాన పారిశుధ్యం ప్రత్యేక కార్యక్రమం జరుగుతోంది. కాలువలలో పూడిక తీసి ఎబేట్ స్ప్రే చేస్తున్నారు. ఈసందర్భంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటుగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి జగదీష్ ప్రజలకు వివరించారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



వేడుకలో పాల్గొన్న స్నేహితులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 4: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక లాయర్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరికొకరు దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ప్రసాద్, రీజనల్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు నెల మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. దీని ద్వారా ఒకరిపట్ల ఒకరికి స్నేహభావం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఈదర వెంకటేష్, కార్యదర్శి గ్రంధి పార్థసారథి, కోశాధికారి లక్ష్మణస్వామి, తమ్మన ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్దన్, తాత అశోక్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వారం అయ్యింది.. అలాగే వదిలేశారు..!



పైపులైన్ లీకేజీ

నగరంలోని హిల్‌టవర్ ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలో ఏర్పడిన పైపులైను లీకు మరమ్మతు కోసం వారం క్రితం తవ్వారు. అయితే నేటికి సమస్య పరిష్కారం కాకపోవడంతో కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు అలాగే వదిలేశారు. దీంతో రోజు నీరు వృధాగా రోడ్డుపై ఏరులై పారుతుండగా, లీకు సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ క్రమంలో గతవారం రోజులుగా హిల్‌టవర్, మామిడిపాలెం, గద్దలగుంట, ఆ పైపులైను ఆధారంగా నీరు సరఫరా అయ్యే పలు కాలనీలకు నీటికష్టాలు ఎదురయ్యాయి. దీంతో కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసినా, మరి కొన్ని ప్రాంతాలకు అదికూడా సాధ్యపడటం లేదు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి, లీకు సమస్య త్వరితగతిన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - ఒంగోలు (కార్పొరేషన్)

కూరగాయల మార్కెట్‌లో అడ్డదిడ్డంగా..!

ఏకంగా రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



తమ దుకాణాలలో కాకుండా రోడ్డుపై సరుకును ఉంచి విక్రయిస్తున్న వ్యాపారులు



రోడ్ల ఆక్రమణతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 4: ఒంగోలు నగరం కొత్త కూరగాయల మార్కెట్‌లో రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. మార్కెట్‌లో ఉత్తరంగా వేసిన రోడ్డును ఒక వైపు పూర్తిగా వ్యాపారులు ఆక్రమించేశారు. డివైడర్లు వేసి రెండు వైపుల వాహనాలు రాకపోకలు ఉండే విధంగా విశాలంగా రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే వ్యాపారులు ఒక వైపు పూర్తిగా రోడ్డుని ఆక్రమించి తమ సరుకును దుఖాణాలలో కాకుండా రోడ్డుపైనే పెడుతున్నారు. దీంతో పూర్తిగా ఈ రోడ్డులో వాహనరాకపోకలు జరకుండా అడ్డుకుటున్నారు. దీంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్ల ఆక్రమణలపై అటు కార్పొరేషన్ అధికారుల, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కొత్త కూరగాయల మార్కెట్‌లో రోడ్లపై ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల్లేవ్.. గ్రామాభివృద్ధి ఎలా ?

మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన • విద్యుత్ సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో ప్రశ్నిస్తున్న చేకూరపాడు సర్పంచ్ రమేష్‌బాబు



విద్యుత్‌శాఖపై సమీక్ష చేస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 4 : సర్పంచులుగా ఎన్నికైన నాటి నుంచి పంచాయతీలకు ఆదాయం లేక, నిధులు రాక గ్రామాలను అభివృద్ధి చేసేది ఎలా అని పలువురు సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో వాపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల లేక పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని, కన్నీళ్ళు దిగమింగుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నాలుగులప్పలపాడు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వంగిపోయి శిథిలావస్థకు చేరాయని, కరెంటు తీగలు కిందకు ఉండి ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మద్దిరాలపాడులో తీగలు కిందగా ఉన్నాయని, కరెంటు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని ఆశాఖ అధికారులకు తెలిపినా పరిష్కారం కావడంలేదని సర్పంచ్ స్వర్ణ అనురాధ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఉప్పుగుండూరు గ్రామంలో లోఓల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తుందని ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు ప్రశ్నించారు. కొత్తకోట సచివాలయంలో లైన్‌మెన్ లేక విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడంలేదని తక్కెళ్ళపాడు సర్పంచ్ రామ్మోహనరావు చెప్పారు. విద్యుత్ సమస్యలపై ప్రతి సమావేశంలో సభ్యులు నిలదీస్తున్నా ఆ శాఖ ఏఈ రమేష్‌బాబు స్పందించకపోవడంపై ఎంపీపీ అంజమ్మ అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులను పంచాయతీలు తమ శాఖకు అందిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ వివరించారు. గ్రామాల్లో సహజవనరులైన ఇసుక, మట్టి, గ్రావెల్‌లను అక్రమంగా తరలిస్తున్నారని, సర్పంచులు అధికారులను సమన్వయం చేసుకొని అడ్డుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ జయలక్ష్మి సూచించారు. త్రోవగుంట తాగునీటి పథకం నుంచి చేకూరపాడు గ్రామానికి రావాల్సిన వాటా నీటిని అందించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమయ్యారని చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు విమర్శించారు. మైనర్ పంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో మహాలక్ష్మి మాట్లాడుతూ సర్పంచులు వనరులను గుర్తించి సంపదగా మలచుకుని గ్రామాభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయించగా కేంద్ర ప్రభుత్వం రూ.2.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు అందిస్తుందని హౌసింగ్ అధికారులు వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ యాదాల రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

• ఎస్పీ దామోదర్



వైద్యశిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 4: పోలీసుశాఖలో పని చేస్తున్న సిబ్బంది సక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పోలీసు కల్యాణమండపంలో మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఒత్తిడి, ఆందోళనకు గురవుతుంటారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే పోలీసులు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కాగా వైద్యశిబిరంలో ఉపాస్ స్పెషాలిటీ హాస్పటల్ డాక్టర్లు ఉమాపతిచౌదరి, కె.అనిల్, యు.శ్రీనివాస్, పోలీసు యూనిట్ ఆసుపత్రి డాక్టర్ భానుమతి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలి

• ఏపీటీఎఫ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 4: రాష్ట్ర పాఠశాల విద్యాకమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో చేయనున్న టీచర్ల సర్దుబాటును నిలిపివేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఆదివారం ఒంగోలులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలల దుస్థితికి కారణమైన 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ తప్పిదాలతో దెబ్బతిన్న ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి గాడిలో పెడతామని ప్రకటించిన ప్రభుత్వ పెద్దలు పాత విధానాలనే కొనసాగించడం దారుణంగా ఉందన్నారు రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు మాట్లాడుతూ గతంలో జరిగిన టీచర్ల సర్దుబాటు వల్ల జరిగే ఇబ్బందులను జిల్లా, మండల స్థాయి అధికారులు పరిష్కరించేవారన్నారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా రాష్ట్ర స్థాయిలో కమిషనర్ సర్దుబాటు నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.మంజుల, నాయబ్‌రసూల్, శేషారావు, తిరుమల, హనుమంతరావు శేషిరెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

• యానాది సంక్షేమ సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య

ఒంగోలు నగరం, ఆగస్టు 4: ఎస్టీ వర్గీకరణ జరిపి యానాదులకు న్యాయం చేయాలని యానాది సంక్షేమ సంఘం సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఒంగోలులోని గిరిజనభవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ.పెంచలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం పెంచలయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయమే ధ్యేయంగా పాలన చేస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేపట్టి ఎస్టీ తెగలలో అత్యంత జనాభా కలిగి అన్ని విధాలా వెనుకబాటుతనంలో ఉన్న యానాదులకు న్యాయం చేయాలన్నారు. ఎంతో దుర్భర జీవనం సాగిస్తున్న యానాదుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో యానాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన నాయకులు మాట్లాడారు. సమావేశంలో యానాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. టీటీడీ బోర్డులో యానాదులకు అవకాశం కల్పించాలని, ఎస్టీలకు సంక్షేమం కోసం గతంలో అమలు చేసిన అన్ని పథకాలను తిరిగి పునరుద్ధరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండేటి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర చైర్మన్ మేకల శ్రీనివాస చక్రవర్తి, కోశాధికారి ప్రభావతి, అధికార ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

విద్యారంగాన్ని గాడిలో పెట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 4 : గత ప్రభుత్వం నిర్వీర్యమైన విద్యారంగాన్ని నూతన ప్రభుత్వం గాడిలో పెట్టాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మరలా అవే తప్పులు చేస్తుందన్నారు. పాఠశాలలను దెబ్బతీసిన 117 జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, దానిని వెంటనే అమలు చేయాలన్నారు. పది మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నారని, ఆ విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వారు కోరారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో ఒకరోజు ఆలస్యంగా నీటి సరఫరా

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 4: తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఒంగోలు నగరంలో ఒకరోజు ఆలస్యంగా నీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. శనివారం స్థానిక పంప్‌హౌస్ వద్ద విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంపింగ్ సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. దీంతో సోమవారం సరఫరా కావాల్సిన నీరు మంగళవారం, కాలనీలకు మంగళవారం రావాల్సిన నీరు బుధవారం ఇలా ఒక రోజు ఆలస్యంగా సరఫరా అవుతాయన్నారు. ప్రజలు సమస్యను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కమిషనర్ కోరారు.

కొవిడ్ నష్ట నివారణపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 4: దేశంలో కొవిడ్ నష్ట నివారణకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆర్థిక నష్ట నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ విజయాలు, లాభపడిన నిర్దిష్ట రంగాలు, కీలక పరిశ్రమల స్వాలంబనకు భవిష్యత్ ప్రణాళికలు ఏమిటని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆర్థిక సహాయమంత్రి పంకజ్‌చౌదరి సమాధానం ఇస్తూ దేశంలో కొవిడ్‌తో సంభవించిన నష్ట నివారణకు భారత్ అభియాన్ కింద మూడు ప్యాకేజీలను 2020 మే, అక్టోబరు నవంబరు నెలలో కేంద్రం ప్రకటించిందన్నారు. వీటి వలన పలు రంగాల స్వావలంబనకు ఆర్థికవృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 4 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం అద్దంకిబస్టాండులోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మహాసభకు బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ చట్టాలకు అనుగుణంగా రాష్ట్రంలో జీవో నెంబరు 21 రవాణా కార్మికులపై కత్తిలాగా పనిచేస్తుందన్నారు. చలానాలు, జరిమానాలు రోజువారీ కార్మికులపై పడుతుందని ఆరోపించారు. ఫెడరేషన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగర పరిధిలో ఆటో కార్మికులందరికీ చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సమగ్ర చట్టం ఏర్పాటు చేయడంతో పాటు ఆటోలు ఉన్న ప్రతిచోట స్టాండ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.తిరుమలయ్య, కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా కొండయ్య, అలాగే కొండారెడ్డి, ఆనంద్, రామిరెడ్డి, సభ్యులను ఎన్నుకున్నారు.

ఈ-పంట నమోదు ప్రారంభం

టంగుటూరు, ఆగస్టు 4: 2024 ఖరీఫ్ పంటకు సంబంధించి ఈపంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఏవో స్వర్ణలత ఆదివారం చెప్పారు. మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో నువ్వు పంట విస్తారంగా సాగు చేశారని, సుమారు రెండు వేల ఎకరాల్లో నువ్వు సాగైందని తెలిపారు. రైతులు దగ్గరుండి ఈపంట నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

14 మంది జూదరుల అరెస్ట్

సింగరాయకొండ, ఆగస్టు 4 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పాత లారీ యూనియన్ కార్యాలయం సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,330 స్వాధీనం చేసుకున్నారు. పాకల పంచాయతీ పరిధిలోని పోతయ్యగారి పట్టపుపాలెంలో కోడి పందేల బరిపై దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.2,350 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.శ్రీరామ్ మాట్లాడుతూ ఎస్పీ దామోదర్ ఆదేశాలు మేరకు పేకాట, కోడి పందేల శిబిరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

జిల్లా యోగా బాల, బాలికల జట్లు ఎంపిక



క్రీడాకారుల యోగాసనాలు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 4: ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగా బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.శివాజీ, డీఎల్.కిరణ్మయి ప్రకటించారు. ఆదివారం ఒంగోలులో 8 నుంచి 25 సంవత్సరాల వయస్సు కు సంబంధించి వేర్వేరుగా జట్లు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో టీవీ.చైతన్య, గొల్లపల్లి బద్రీనాథ్, కె.సుందర్రావ్, సూఫుద్దీన్‌ఖాన్, ఎం.వెంకటేష్, పీవీ.వీరాంజనేయులు, వరుణ్‌సాయి, కె.భార్గవ్, కె.భరత్‌కుమార్‌రెడ్డి ఎస్.సిద్ధిసాయిబాబా, బి.భాస్కర్‌రావు, బాలికల విభాగంలో వీవీ.హర్షిణి, సీహెచ్.శిమన్విత, ఎ.లిఖిత, ఎస్.గ్రేష్మీ, ఎన్.శృతి, ఓవీ.రేణుక, కె.శాంతి, కె.క్రాంతిప్రసన్న, ఎ.ఉదయ్‌శ్రీ, శ్వేత, ఎన్.చిన్మయిసాయిచంద్ర, యు.సుశీల, ఎంపికయ్యారు. అలాగే 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు విభాగంలో ఎస్.రాధ, బి.ప్రశాంతి ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 4 : కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు ఆదివారం ఉప్పుగుండూరులో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కేరళలో అనేక మంది ప్రాణాలు కోల్పోయి అపార నష్టం వాటిల్లిన నేపథ్యంలో జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. దేశవ్యాప్తంగా సీపీఎం, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి కనీసం కోటి రూపాయలు అందించాలని తీర్మానించారు. విరాళాల సొమ్మును కేరళ బాధితులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, యు.వెంకటేశ్వర్లు, జి.బసవపున్నయ్య, అత్తంటి సురేష్, కాకాని సుబ్బారావు, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదవడం నాకిష్టం'

టంగుటూరు, ఆగస్టు 4 : టంగుటూరు ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం చదవడం నాకిష్టం కార్యక్రమం గ్రంథపాలకుడు వర్ధనరాజు ఆధ్వర్యంలో జరిగింది. పలువురు విద్యార్థులు చక్కగా పుస్తకం పఠనం చేశారు. పలు విషయాలను సహచరులకు వివరించారు.

మోదీ, చంద్రబాబు, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం

కొండపి, ఆగస్టు 4 : మాదిగల రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్, కొండపి మాదిగపల్లెకు చెందిన యువకులు ఆదివారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, ప్రధాని మంత్రి మోదీ, సీఎం చంద్రబాబు ఫొటోలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కాములూరి గోవర్ధన్, పందిటి నాని, కొమ్ము కవిరాజు, ఈతముక్కల బ్రహ్మయ్య, తులశమ్మ, మార్కు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



చిన్నారులతో పూర్వ విద్యార్థులు

టంగుటూరు, ఆగస్టు 4 : టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 1995-96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా ఒంగోలులోని బొమ్మరిల్లు అనాథ శరణాలయంలోని అనాథలకు అన్నదానం చేశారు. వారు 2023లో ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. ఈసందర్భంగా శరణాలయం నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షిక వేడుకలు

బల్లికురవ. ఆగస్టు 4 : బల్లికురవ గ్రామంలో ఉన్న పోలేరమ్మ దేవాలయ 13వ వార్షిక వేడుకలు ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పోలేరమ్మకు గ్రామోత్సవం నిర్వహించి ప్రతి ఇంటి నుంచీ చద్దిని సేకరించి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. గ్రామస్థులు సమిష్టి కృషితో ప్రత్యేక భజనలను ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. 13 ఏళ్ల నుంచి గ్రామ దేవత అయిన పోలేరమ్మ దేవాలయ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు ఈసందర్భంగా తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..!

- శింగరకొండ దేవస్థానం ఆదాయానికి గండి
- దాతల సాయంతో రూ.30లక్షలతో దుకాణాల నిర్మాణం
- 10లో మూడింటిలోనే షాపులు
- నెలకు రూ.70వేల ఆదాయం పక్కదారి



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం .... దాతల సహకారంతో నిర్మించిన దుకాణాలు

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధిలో దాతల పాత్ర కీలకం. అయితే దాతల సహకారం తీసుకునేటప్పుడు ఉన్న శ్రద్ధ అనంతరం నిర్వహణ సమయంలో చూపకపోవడంతో ఆదాయానికి గండి పడుతుందన్న భావన భక్తులలో నెలకొంది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దక్షిణ రాజగోపురం ముందు వైపు పల్నాడు జిల్లా కోటప్పకొండ సమీపంలోని కట్టుబడిపాలెంకు చెందిన దాత ఆంజనేయులు సహకారంతో సుమారు 30లక్షల రూపాయల వ్యయంతో 10 దుకాణాలను నిర్మించి సుమారు 6 నెలల క్రితం దేవస్థానానికి అప్పగించారు. ఆ షాపులు అద్దెకు ఇచ్చేందుకు బహిరంగ వేలం పాటలు నిర్వహించి కేటాయిస్తారు. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన వేలం పాటలలో నాలుగు షాపులు మాత్రమే అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. అందులో ఓ దుకాణ నిర్వాహకుడు తాను నడుపుకోలేనని చెప్పినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుతం మూడు దుకాణాలలో మాత్రమే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మిగిలిన 7 షాపులు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో దుకాణానికి నెలకు రూ.10వేల అద్దె వచ్చే అవకాశం ఉండడంతో నెలకు 70 వేల రూపాయలు ఆదాయం కోల్పోతున్నారు. షాపులు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారాలు ముందుకు రాకపోవడానికి అసలు కారణాలు పై మాత్రం దేవాలయం అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. శింగరకొండలో దేవస్థానానికి అద్దెలు చెల్లించే దుకాణాల కంటె రెట్టింపు సంఖ్యలో ప్రైవేటు దుకాణాలు నడుస్తున్నాయి. ఎలాంటి అద్దె లేకుండా ప్రైవేటు షాపులు, తోపుడుబండ్లు నిర్వహిస్తుండడంతో పూజా సామగ్రి మొదలు అన్ని రకాల సామానులు తక్కువ ధరకే లభ్యమవుతున్నాయి. దీనికి తోడు దేవస్థానానికి అద్దె చెల్లించే దుకాణాలలో ధరల నియంత్రణ పై కూడా అధికారులు దృష్టి పెట్టకుండా ఉదాసీనంగా వ్యవహరించడం కూడా విమర్శలకు తావిస్తుంది. దీంతో ఎక్కువ మంది భక్తులు బయట వ్యాపారుల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులను తొలగింపు విషయంలో దేవస్థానం అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో దాతల సహకారంతో నిర్మించి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే 7 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేటు దుకాణాలను ఖాళీ చేయించి దేవస్థానం ఆధ్వర్యంలో దుకాణాలలో వ్యాపారాలు జరిగే విధంగా చర్యలు చేపట్టి దేవస్థానం ఆదాయం పెరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే దుకాణాలలో పూజా సామగ్రి మొదలు అన్ని రకాల వస్తువులను నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 4: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మున్సిపాల్టీలో ప్రజలకు నీటి సరఫరా కోసం ప్రముఖ వైద్యులు గురుబ్రహ్మం జ్ఞాపకంగా ఆయన కుటుంబసభ్యులు అందచేసిన నీటి ట్యాంకర్‌ను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా నీటి సమస్య ఉందని చెప్పారు. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టినట్టు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులను అనతి కాలంలోనే రాబట్టి కనిగిరిలో ఇంటింటికి తాగునీటి కుళాయిలను వేయిస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రముఖ వైద్యులు తనయులు చప్పరం వాసు లాంటి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిరంజీవి (వీవీఆర్ మనోహరరావు), సానికొమ్ము తిరుపతిరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, షరీఫ్, సామిల్ అబ్దుల్, గంగిరెడ్డి, కేవీఎస్ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సరిత

పట్టుదల, క్రమశిక్షణతోనే లక్ష్య సాధన

మేదరమెట్ల, ఆగస్టు 4 : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని ఎస్పీ సరిత అన్నారు. ఆదివారం కొరిశపాడు మండలం దైవాలరావూరులో కిరణ్ జ్యోతి రీసెర్చి ఫౌండేషన్ 20వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తలదించుకుని చదివితే తలెత్తుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. అదే సెల్ ఫోన్లు చూస్తే జీవితాంతం తలదించుకోవాల్సి వస్తుందన్నారు. పుట్టిన ఊరును ఎవరూ మరిచిపోరాదన్నారు. రాజశేఖర్ పుట్టిన ఊరును గుర్తుంచుకుని ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పుట్టిన ఊరికి ఏదో చేయాలనే తలంపుతోనే గ్రంథాలయం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ఉద్యోగాలు ఏర్పాటుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతా మహాలక్ష్మమ్మ, శేషారెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం

మార్టూరు, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా ఇవ్వడంతో మార్టూరులోని అంబేడ్కర్ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి పెద్ద అండర్‌పాస్ వద్ద మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్‌నగర్ కాలనీలో పండుగ వాతావరణం ఏర్పడింది. కాలనీకి చెందిన అంబేడ్కర్ యూత్ యువకులు, బాబూ జగజ్జీవన్‌రామ్ అభిమానులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆనందంతో కోలాహలంగా ఊరేగింపుకార్యక్రమం నిర్వహించారు. బాణసంచాకాలుస్తూ, డప్పులు, వాయిద్యాలతో యువకులు అందరూ ర్యాలీగా కాలనీలో పర్యటించారు. వారికి ప్రతి ఇంటి నుంచీ మద్దతుగా కాలనీవాసులు సంఘీభావం ప్రకటించారు. దాదాపుగా కాలనీలోని ప్రతివీధిలో కృష్ణమాదిగ చిత్రపటాన్ని ఊరేగిస్తూ కార్యకర్తలు సందడి చేశారు. అనంతరం ఊగింపుగా పెద్ద అండరు పాస్ వద్దకు చేరి కృష్ణమాదిగ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులైన యువకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

అద్దంకిటౌన్, ఆగస్టు 4 : అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా అద్దంకిలోని సేవా స్ఫూర్తి కమిటీ (ఎస్ఎంసీ) 1989-90 బ్యాచ్ పదివ తరగతి పూర్వ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బధిరుల ఆశ్రమ పాఠశాలకు స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాలకు అవసరమైన వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతు మా పదివ తరగతి బ్యాచ్ విద్యార్థుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, స్ఫూర్తి కమిటీ పేరుతో అనేక సేవా కార్యక్రమాలను ఏళ్లుగా నిర్వహిస్తుందన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వాటర్ ఫ్రిజ్‌ను, వాటర్ బబుల్స్‌ను అందించామన్నారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతిని ఏర్పాటు చేశారు. గత 9 సంవత్సరాల నుంచి పూర్వ విద్యార్థులందరూ కలిసి పలు కార్యక్రమాలు చేసినట్లు రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సహకార్యదర్శి ధర్మవరపు వెంకటరావు, ట్రెజరర్ కొత్త శ్రీమన్నారాయణ, సభ్యులు బాలాజీ, పురుషోత్తం, నరహరి, శ్రీను, మురళి, ప్రసాద్, గురుశేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక స్థావరాన్ని పరిరక్షించండి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 4 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీశ్రీశ్రీ భువనగిరి సుబ్బయ్య స్వామి ఆధ్యాత్మిక ధ్యాన స్థావరాన్ని పరిరక్షించాలని పలువురు కమిటీ ప్రతినిధులు కోరారు. సుమారు 1940వ సంవత్సరంలో సుబ్బయ్య స్వామి స్థలంను ఆధ్యాత్మిక చింతన కోసం ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఇటీవల ఆ స్థలాన్ని కొందరు ఆక్రమణలకు పాల్ప డుతున్నారని వివరించారు. ఈనేపథ్యంలో గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేరొన్నారు. అయినా పరిష్కారం కాలేదని చెప్పారు. దీంతోనే నిరసన ర్యాలీ నిర్వ హించినట్లు చెప్పారు. అధికారులు ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడు కున్నారు. కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఆగస్టు 4: పవిత్ర పుణ్యక్షేత్రంగా వె లుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న గుం టి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూ జలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుం చి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెం దిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. చల్లంగ చూడమ్మ గం గమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. స్థానిక ఎస్సై కె.విజయ్ కుమార్ కుటుంబసభ్యులతో కలిసి అ మ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు, ఆగస్టు 4: మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రా మంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. వీరినుంచి రూ.11,030 నగదును స్వా ధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరు స్తున్నట్టు ఆయన తెలిపారు. దాడుల్లో రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మహేష్ ప్రేమానిధి, మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలురాదా ఎడ్ల పందేలు

ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



చీరాల హరిప్రసాద్‌నగర్‌లో ఎడ్ల పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 4 : హరిప్రసాద్‌నగర్‌లోని పేరాల పోలేమర్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల పందేలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన ఎడ్ల బండిపై ఎక్కి చెర్నాకోలా ఊపుతూ అందరినీ ఉత్సాహపరిచారు. ముందుగా పోలేరమ్మ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీలు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు.

చీరాల మండలం జాండ్రపేట శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కొండయ్యను ఘనంగా సన్మానించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

వేటపాలెం మండలం రామన్నపేట చౌడేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ విశిష్టతను తెనుకున్నారు. అనంతరం పందిళ్లమ్మ తల్లి పొంగళ్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీల ప్రతినిధులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఏలూరి కంటి వైద్య శిబిరానికి స్పందన

- 1,100 మందికి సేవలు
- 475 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సూచన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 4 : ప్రజా సేవే లక్ష్యంగా లక్ష మందికి కంటి చూపు అందించాలనే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వైద్య సేవలు అందిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏలూరి చారిటబుల్, నోవా ఆగ్రిటెక్ ఆధ్వర్యంలో గుంటూరు శంకరకంటి ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుంచి ప్రాంగణంలో రోగులు బారు లు తీరారు. ఏలూరి ఆదేశాల మేరకు పురుషులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. 1100 మందికి పైగా రోగులకు ఉచితంగా రక్త, బీపీ, షుగర్ కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 475 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్సలకు సూచించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారకరామారావు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలందించుటలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సాటిలేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల నెలనెలా వైద్య శిబిరాలను నిర్వహిస్తూ కంటి వెలుగు ప్రదాతగా నిలిచారన్నారు. ప్రజల అభిమానాన్ని చురగొన్నారన్నారు. సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారన్నారు. లక్షమందికి కంటి చూపునందించడం లక్ష్యంగా ఏలూరి చారిటబుల్ ట్రస్టు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు మార్క్, బేతపూడి సురేష్, వీరగంధం ఆంజనేయులు, హనుమ య్య, పేర్ని బాపయ్య, ఆయోషా బుబుడే, చెరుకూరి రమేష్‌బాబు, దేవతోటి నాగరాజు, సాంబయ్యశివయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

మాన్యం భూములపై దేవస్థానానికే సర్వహక్కులు

- అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి



పామూరులోని నెల్లూరు రోడ్డులోని దేవస్థాన భూమిలో బోర్డును ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

పామూరు, ఆగస్టు 4: పామూరులోని శ్రీమదన వేణుగోపాలస్వామి, శ్రీ వల్లీభుజంగేశ్వరస్వామి, శ్రీవరదరాజుల స్వామి, శ్రీఆంజనేయస్వామి దేవ స్థానాలకు చెందిన మాన్యం భూములపై దేవస్థానానికి సర్వహక్కులు ఉం టాయని ఒంగోలు ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్దన్‌రెడ్డి పేర్కొ న్నారు. కమిషనర్ ఆదేశాలతో పామూరు పట్టణంలోని సర్వే నెంబర్ 256/ 1,2. 441/1,2,3, 442/ 1,2,3, వేంపాడు గ్రామ పరిధిలో గల సర్వే నెంబర్ 78/1 లో గల దేవస్థాన భూముల్లో, విరువూరు రోడ్డులో గల దేవస్థాన భూముల్లో సిబ్బంది బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ భూములు ఆలయాలకు సంబంధించినవని, ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరిస్తూ దేవస్థాన ఈవో గిరిరాజు నరసింహబాబు బోర్డులు ఏర్పాటుచేశారు.

దేవదాయ శాఖ సమర్పించిన రికార్డుల ప్రకారం నెల్లూరు జిల్లా వరికుంటపాడు రెవెన్యూ పరిధిలో గల వేంపాడు గ్రామ సర్వే నెంబర్ 78/1లో 6.08 ఎకరాల భూమి పామూరు మదన వేణుగోపాల స్వామి దేవస్థానానికి చెందినదిగా కోర్టు అభిప్రాయపడింది. అందుకనుగుణంగా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేయాలని వరికుంటపాడు తహసీల్దార్‌ను జేసీ కోర్టు ఆదేశించిందని అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్దన్‌రెడ్డి తెలిపారు. 22ఏ 1సి రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని ఆలయ నిషేధిత ఆస్తుల జాబితాలో సర్వే నెంబర్ 78/1ని చేర్చడానికి నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ ప్రతిపాదనను సమర్పించాలని కార్యనిర్వహణాధికారిని కోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈక్రమంలో మాన్యాలు అమ్ముకొన్న వారు, అట్టి భూములను కొనుగోలు చేసినవారు బోర్డులు ఏర్పాటు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా పట్టణ నడిబొడ్డున దేవస్థానానికి చెందిన షాపులకు త్వరలో వేలం పాట నిర్వహిస్తామని నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడంతో అలజడి నెలకొంది.

గ్రామ సచివాలయ భవనం తెరిపిస్తాం!

తాళ్లూరు, ఆగస్టు 4: తురకపాలెం గ్రామ సచివాలయ భవనాన్ని తెరిపిస్తామని ఏఈఎం వెంకటేశ్వరరావు తెలిపారు. కాంట్రాక్టర్ నుంచి భనవం తాళం తీసుకొని తెరిపిస్తామని పేర్కొన్నారు. తురకపాలెం సచివాలయం వినియోగంలోకి వచ్చే నా! శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. మండల ఏఈఎం వెంకటేశ్వరరావు ఇందుకుసంబంధించి అధికారులకు నివేదించారు. గ్రామ సచివాలయ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.13 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికీ రూ.27 లక్షలు చెల్లించినట్టు చెప్పారు. కాంట్రాక్టర్‌ను అనేకమార్లు తాళం ఇవ్వమని కోరినా స్పందించలేదని, బిల్లులు రావాలని తాళం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 4: మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకాలు చేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజల చేశారు.

కష్టాల్లో కరివేపాకు రైతులు

- దిగజారిన ధరలు
- కిలో రూ.2కు కొనుగోలు చేస్తున్న దళారులు
- కొత్త కూలి కూడా రాక వదిలేస్తున్న వైనం



పసుపుగల్లులో సాగు చేసిన కరివేపాకు

ముండ్లమూరు, ఆగస్టు 4: మండలంలోని పలు గ్రామాల్లో కరివేపాకు సాగు చేస్తున్న రైతులు కష్టాల పాలవుతున్నారు. మార్కెట్‌లో ధర రోజురోజుకు పతనమవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవటంతో చేసేదేమిలేక తోటలను కొంతమంది దున్ని వేస్తున్నారు. మరికొంతమంది వచ్చిందే దక్కుదలని విక్రయిస్తున్నారు. వాస్తవానికి కరివేపాకు సాగు చేసిన రైతులు ఏడాదికి మూడుసార్లు ఆకు దిగుబడి వస్తే వాటిలో ఒక్కసారే ఆశించిన విధంగా ధర ఉంటుంది. మిగతా రెండు సార్లు వచ్చే దిగుబడి నష్టాలే చవిచూస్తున్నాయి. ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర లేకపోవటంతో నష్టా లు మూట గట్టుకుంటున్నారు. మండలంలోని పసుపుగల్లు, ముం డ్లమూరు, సింగనపాలెం, రెడ్డినగర్, పెదఉల్లగల్లు, శంకరాపురం, మారెళ్ల గ్రామాల్లో కరివేపాకు తోటలు విపరీతంగా సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేదని చెప్పి దళారులు కేవలం కిలో రెండు రూపాయలకు కొనుగోలు చేస్తామని చెబుతుండటంతో చేసేదేమిలేక కొంతమంది రైతులు అమ్మివేస్తున్నారు. మరికొంత మంది రైతులు తోటల్లోనే కోసి పడవేస్తున్నారు. వరుసగా ఐదు సంవత్సరాల నుంచి కరివేపాకు తోటలు సాగుచేస్తున్న రైతులు నష్టాలపాలవుతున్నారు.



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ముత్తుములకు ఘన సన్మానం

కంభం, ఆగస్టు 4 : పిచ్చోడి చేతిలో రాయిలా మారిన ఐదేళ్ల వైసీపీ పాలనను స్వస్తి చెప్పి టీడీపీకి పట్టం కట్టడంతో కీలక భూమిక పోషించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం రుణపడి ఉంటుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడి సారథ్యంలో స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా సాగుతున్న రాష్ట్రానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆదివారం కంభంలోని బృందావన్ ఫంక్షన్ హాలులో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో తాను 21వ రౌండ్‌లో 301 ఓట్లు వెనుకబడి ఉన్నానన్నారు. తనకు వచ్చిన పోస్టల్ ఓట్లలో 66శాతంతో గెలుపును అందిపుచ్చుకున్నట్లు తెలిపారు. అందుకు కారణమైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తన విజయం అంకిత మన్నారు. తన గెలుపు మీదేనని భావోద్వేగంతో ప్రసంగించారు. గతంలో వైసీపీ ఇచ్చిన భూటకపు హామీలను నమ్మి పిచ్చివాడి చేతికి రాయి ఇచ్చినట్లు జగన్‌కు రాష్ట్రాన్ని అప్పగించామన్నారు. అయితే ప్రజలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు జరిగిన పొరపాటు సరిదిద్దు కొన్నారన్నారు. పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేశారని, కూటమిలో భాగస్వామైన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సహకారం, దేశప్రధాని నరేంద్రమోడి తోడ్పాటుతో రాష్ట్రం అభివృద్ధిలో ముంద డుగు వేస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని ఆటుపోట్లను దాటుకుని 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, సామాజిక పింఛన్లు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసేలా 175 జీవోను తీసుకు వచ్చిందన్నారు. ఆ జీవో ద్వారా పాఠశాలల విలీనంతో రాష్ట్రంలో 5 వేల పాఠశాలలను మూసివేసినట్లు తెలిపారు. దీంతో పాటు ఆకస్మిక తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను మానసికంగా వేధించిందన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్యావంతుడైన యువకుడు నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నందున ఉపాధ్యాయుల సమస్యలు తొలగి పాఠశాలలు బాగు పడతాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి పథకానికి జగన్మోహన్‌రెడ్డి తన పేరును ముందు తగిలించుకొన్నాడన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకం పేరు పెట్టిందన్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్‌లు అందించామన్నారు. 'నేను మీ కుటుంబసభ్యుడినని, మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను మూడు మండలాల సంఘాల వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, కొత్తపల్లి శ్రీనివాసులు, గుంటూరు జిల్లా ఎంపీడీవో రంగనాయకులు, కంభం ఎంపీడీవో మస్తాన్‌వలి, ఎంఈవోలు మాల్యాద్రి, అబ్దుల్‌సత్తార్, కాశయ్య, తురిమెళ్ళ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోని, మాజీసర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తాటికొండ రామారావు పగడాల పాండు, ఎం.కేశవ, బీవీ.రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, మల్లికార్జున, గోన చెన్నకేశవులు, కేతం శ్రీనివాసులు పాల్గొన్నారు.


అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

గుంతలు తీశారు.. నిర్మాణం మరిచారు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4: పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీకి వెళ్లే దారిలో డ్రైనేజీ నిర్మాణానికి కాలువ గుంతలు తీశారు. కానీ మూడు నెలలు గడిచినా దాని నిర్మాణం మరిచారు. ఇక్కడే అంగన్‌వాడీ కార్యాలయం కూడా ఉంది. గృహాలు కూడా ఉన్నాయి. గుంతలు తీసి వదిలివేయడంతో అంగన్‌వాడీలోని పిల్లలు, ఇల్లులు ఉన్న స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలు తీసి వదిలేసిన కాలువ

ఆరుగురు జూదరుల అరెస్టు

కొమరోలు, ఆగస్టు4 : పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.5890లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మధుసుదన్ రావు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్సై మధుసుదనరావు, సిబ్బంది కలసి గాలించగా పేకాట ఆడుతున్న శిబిరాన్ని చుట్టుముట్టి వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.5890లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న వారిని రేపు గిద్దలూరు కోర్టులో హాజరుపర్చనున్నామన్నారు.

అనుమతి లేకుండా ఇసుకనిల్వ ఉంచరాదు


ఇసుక నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

కొమరోలు, ఆగస్టు 4 : ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవ్వరూ ఇసుకను నిల్వ ఉంచరాదని గిద్దలూరు ఎస్‌ఈబీ సీఐ కొండారెడ్డి అన్నారు. కొమరోలులో నిల్వ ఉంచుతున్న ఇసుక నిల్వలను సెబీ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ కొమరోలు నుంచి యర్రపల్లి వెళ్లే మార్గంలోని పీర్ల మాన్యంలో నిల్వ ఉంచిన ఇసుకను పరిశీలించామన్నారు. కానీ అక్కడ ఎవ్వరూ లేక పోవడంతో కేసు నమోదు చేయలేకపోయామన్నారు. ఇసుక డంపు చేస్తున్నారని సమాచారం మేరకు ఎస్‌ఈబీ అధికారులు పీర్లమాన్యంలోని ఇసుక పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక విలేకరులు అక్కడకు వెళ్లే సరికి డ్రైవర్లతో కలసి ఓనర్ల సెల్ నెంబర్లు తీసుకొని అక్కడి నుంచి ఎస్‌ఈబీ అధికారులు హడావుడిగా వెళ్లారు. అయితే డంపును కూడా వీఆర్‌వోలకు అప్పగించకుండా వెళ్లడం పలు విమర్శలకు తావిస్తోంది.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం, ఆగస్టు 4: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయానికి కారణమైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రధానంగా దోర్నాల బస్టాండ్, కంభం కూడలి, గడియార స్తంభం చుట్టుపక్కల దుకాణదారులు, వీధివ్యాపారులను హెచ్చరించారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ తోపుడు బండ్లు పెట్టవద్దని సూచించారు. అంతేకాక దుకాణాల ముందు నిలిపే వాహనాల వలన ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నందున తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అయన వెంట పట్టణ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్ళు, హోమ్‌గార్డులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్, ఆగస్టు 4 : స్థానిక 132/33 కేవీ ట్రాన్స్ కో సబ్‌స్టేషన్ విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలు, కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలు, రాచర్ల మండలంలోని యడవల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో సోమవారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్థానిక విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు డయాలసిస్ సెంటర్ ప్రారంభం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 4 : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించనున్నారు. గిద్దలూరు ప్రాంతంలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ ఆవశ్యకత గురించి ఇటీవల ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి మంజూరు చేయించారు.

పురుగుమందుతాగి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగొండపాలెం, ఆగస్టు 4 : అప్పులబాధతో పురుగులమందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన ఎర్రగొండపాలెంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఉంటున్న షేక్ ఖాశింవలి(46) తనకు తెలిసిన వారి వద్ద రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. అవితీర్చలేక అప్పులు ఇచ్చినవారికి సమాధానం చెప్పలేక శనివారం సాయంత్రం ఇంటిలోనే పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాల చేర్పించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం షేక్ ఖాశింవలి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు ఖాశింవలికి భార్య షేక్ రహిమ ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసమూర్తి తెలిపారు.

మరుగుదొడ్లు కూలగొట్టిన వారిపై చర్యలేవి..?

పొదిలి, ఆగస్టు 4 :పట్టణంలోని పెద్దబస్టాండ్ సమీపంలోని నగరపంచాయతీ స్థలంలో నిర్మించిన మరుగుదొడ్లను ఆక్రమించుకునేందుకు అక్రమార్కులు కూలగొట్టినా వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే మరుగుదొడ్లను ఏడాది క్రితం ప్రభుత్వ స్థలం తమదంటూ కొందరు భూకబ్జాదారులు రాత్రికిరాత్రే నేల మట్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నేలమట్టం చేస్తున్నా అప్పటి నగరపంచాయతీ కమీషనర్ డినియోల్ జోసఫ్ ప్రేక్షకపాత్ర వహించారు. దీంతో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఒంగోలు - నంద్యాల రహదారికి ఆనుకుని పెద్దబస్టాండ్ సమీపంలో ఉన్న ఈ స్థలం విలువ కోట్లలో ఉంటుంది. 13 ఏళ్ల క్రితం అప్పటి సర్పంచి డాక్టర్ స్వర్ణగీత బస్టాండ్ కూడలిలో మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో మరుగుదొడ్లు నిర్మించారు. దీని నిర్మాణ బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి 25 ఏళ్ల వారికి లీజుకు ఇచ్చారు. నాటి ఒప్పందం ప్రకారం 25 సంవత్సరాల అనంతరం ఆ మరుగుదొడ్లను పంచాయతీకి వదిలి వెళ్లే విధంగా మార్కాపురం పట్టణానికి చెందిన సుభాని అనే వ్యక్తికి లీజుకు ఇచ్చారు. అప్పటి నుంచి ఆయనే మరుగుదొడ్లను నిర్మించి నిర్వహణ బాధ్యత చూస్తున్నారు. అయితే ఆ మరుగుదొడ్లను వైసీపీ నాయకుల అండతో కొంత మంది వ్యక్తులు కూలగొట్టి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. లీజుదారుడు ధ్వసం చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు అయినా ఫలితం లేదు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సి కమిషనర్ పంచాయతీ స్థలాన్ని కాపాడేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఈ దౌర్జన్యంలో నియోజకవర్గంలోని అప్పటి ప్రజాప్రతినిధికి సంబంధించిన వ్యక్తుల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. అందుకే అధికారులు మళ్లీ నిర్మించే ప్రయత్నం కూడా చేయలేదు. ప్రస్తుతం నగరపంచాయతీలో మరుగుదొడ్లు లేకపోవడం వలన వివిధ పనులకోసం పట్టణానికి వచ్చే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం కబ్జాచేసేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా నూతన మరుగుదొడ్లు నిర్మించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.


కూలగొట్టిన మరుగుదొడ్లు (ఫైల్)

బాలాత్రిపుర సుందరీదేవికి విశేష పూజలు

త్రిపురాంతకం, ఆగస్టు 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో అమావాస్య ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రదక్షిణలు చేశారు. పొంగళ్లను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. దీనిలో భాగంగా చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి అర్చలను, కుంకుమ పూజలు చేశారు. పూజల కోసం ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.




అమ్మవారికి దర్శనానికి హాజరైన భక్తులు, అమ్మవారు

పెద్దదోర్నాల : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శ్రీ చౌడేశ్వరీ దేవాలయంలో అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మణికంఠస్వామి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆషాడ అమావాస్యను పురష్కరించుకుని భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో కమిటి పెద్దలు నీలూరి వెంకటేశ్వర్లు, చిమ్మని చిన్న వెంకటేశ్వర్లు, కల్లె రవికుమార్, వల్లా మహానంది, కాల్వ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని అయినముక్కల గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ అమావాస్య సందర్భంగా గ్రామ కమిటి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కాకర్ల లక్ష్మీ ప్రసాద్ శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు బోనాలతో తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామకృష్ణా రెడ్డి, గొల్నారు శేఖర్ రెడ్డి, యక్కంటి లింగారెడ్డి, జంగిలి పిచ్చయ్య, వీ కోటిరెడ్డి, వెంకట రెడ్డి, యక్కంటి వెంకటేశ్వర రెడ్డి,కోటి రెడ్డి, ఆదినారాయణ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్ప మాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



చౌడేశ్వరి అమ్మవారికిబోనాలు తీసుకెళుతున్న భక్తులు, పోలేరమ్మవారు

అధ్వానంగా అమరావతి, కడప రహదారి

కొమరోలు, ఆగస్టు 4 : గత పాలకుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా అమరావతి-కడప రాష్ట్రీయ రహదారి ఉంది. ఈ దారిలో లోతైన గుంతలు దర్శనమిస్తాయి. దీంతో ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఐదు సంత్సరాల కాలంలో ఎక్కడ కూడా ఒక్క గుంత పూడ్చిన పాపాన పోలేదు. వర్షం వస్తే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు వాహనదారులు అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా నిధులు లేవు అని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. నిధులు వచ్చిన తర్వాత మరమ్మతులు చేస్తామని గతంలో చెప్పారు.

ప్రకాశం జిల్లా సరిహద్దు గ్రామమైన తిమ్మారెడ్డిపల్లి నుంచి హసనాపురం వరకు ఉన్న రాష్ట్రీయ రహదారిలోని తిమ్మారెడ్డిపల్లి నుంచి అల్లీనగరం గ్రామం వరకు, అల్లీనగరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోనూ, పామూరుపల్లి మలుపు వద్ద సైడు గోడలు లేవు. దీంతో యర్రపల్లి గ్రామం లో, నల్లగుంట్ల గ్రామంలో, పోట్టిపల్లి-తాటిచర్ల గ్రామాల మధ్యలో లోతైన గుంతలు ఉన్నాయి. రోడ్డు మధ్యలోనే ఈ గుంతలు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. దీంతో పాటు రోడ్డు మలుపుల వద్ద లోతైన గుంతలు ఉన్నాయి. వేగంగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవు తున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్రగా యాలపాలైవుతున్నారు. ఈ రోడ్డుపై పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు వస్తుండటం, ఇరుకైన రోడ్డు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అమరావతి- కడప రాష్ట్రీయ రహదారిలోని గుంతలకు మరమ్మతులు చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.


రహదారిపై పడిన గోతులు


అల్లీనగరం వద్ద లోతైన గుంతలు

వరి సాగుకు రైతులు సిద్ధం

త్రిపురాంతకం, ఆగస్టు 4: ఎగువ రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురుస్తూ వస్తున్న నీటితో శ్రీశైలం జలాశయం నిండింది. నాగార్జున సాగర్ జలాశయం కూడా నిండుతోంది. దీంతో సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మండలంలోని రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయకట్టు పరిధిలోని పలువురు రైతులు వరినారు మడులు పోసి నారు పెంచుతున్నారు. ఇప్పటికే 10 నుండి 15 రోజుల క్రితం నారుమడులు పోసినవాళ్లు కొందరైతే ప్రస్తుతం జలాశయాలను చూసి మిగిలిన రైతులు అందుబాటులో ఉన్న బోర్ల కింద, సోలార్ మోటార్ల కింద నారు మడులు పోస్తున్నారు. జలసిరి బోర్లు ద్వారా వెల్లంపల్లి, గొల్లపల్లి, విశ్వనాథపురం, రాజుపాలెం, మేడపి, త్రిపురాంతకం, సోమేపల్లి గ్రామాల్లో అనేక మంది రైతులు వరిసాగుకు నారుమడులు పోశారు. అవి ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. సాగర్ ఆయ కట్టు పరిధిలో మండలంలో ఏటా 12 వేల నుంచి 15 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుంటారు. కాగా గతేడాది సాగర్ జలాలు రాకపోవడంతో రైతులు వరి పంట సాగు చేయలేదు.


రైతులు సిద్ధం చేసుకున్న నారుముడులు

అవీ..ఇవీ..

ప్రతిభా అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, ఆగస్టు 4 : ఉచిత దుస్తులు కోసం, ప్రతిభ అవార్డుల కోసం అర్హులైన పేదవైశ్యులు దరఖాస్తు చేసుకోవాలని ఆవోపా అధ్యక్షులు దారా రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు చెందిన పేద ఆర్యవైశ్యులు ఉచిత దుస్తుల కోసం ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 11వ తేదీన అందజేస్తామన్నారు. ఈ 3 మండలాలకు చెందిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ టాపర్ ఆర్యవైశ్య విద్యార్థులు తమ మార్కుల జాబితాతో ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 11న జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4: మార్కాపురం పట్టణంలోని తెలుగు బాప్టిస్టుటౌన్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దేవరకొండ శ్యామ్యూల్, ఉపాధ్యాక్షులుగా విడుదల కిరణ్, కార్యదర్శిగా పి.జయరావు, కోశాధికారిగా పి.రామస్వామి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దారివేమలు బాబీ, ఈ.సతీష్, ఈ.ఆర్థర్, పోలయ్య, ప్రదీప్, సుజాత, విజయకుమారి, యూత్ డైరెక్టర్‌గా సౌమ్య, స్త్రీల సమాజం అధ్యక్షులుగా మేరి సలోమి, సండేస్కూల్ సూపరింటెండెంట్‌గా గంగాభవాని, వయర్ డైరెక్టర్‌గా వరప్రసాద్, వీఎస్ డైరెక్టర్‌గా ఈ.సుస్మిత ఎన్నికయ్యారు.

ఎంపీజే పట్టణ నూతన కమిటీ ఎన్నిక

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఎంపీజే కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ నాగూర్ మీరావలి, ఉపాధ్యాక్షులు గా సయ్యద్ మస్తాన్ వలి, షేక్ అబ్బాస్, ప్రధాన కార్యదర్శిగా హబీబుల్లా ఖాన్, కోశాధికారిగా షేక్ జవాద్ అహ్మద్‌తో పాటు మరో ఐదుమంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షులు కదీర్, ప్రకాశం, కర్నూల్ జిల్లా అధ్యక్షులు షేక్ కాశీం, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఇస్లాంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంపీజే కార్యాలయాన్ని విశ్రాంత పోస్టల్ ఉద్యోగి షేక్ నజీర్ ప్రారంభించారు.



ఎంపీజే నూతన కమిటీ

ఘనంగా తల్లిపాల వారోత్సవం

గిద్దలూరు, ఆగస్టు 4 : మండలంలోని దంతెరపల్లిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమయ మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు చాలా ముఖ్యమని, బిడ్డ పుట్టిన మొదటి 6 నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని అన్నారు. 6 నెలలు దాటిన తరువాత తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ శ్రీలక్ష్మి, వైద్యసిబ్బంది బాదరయ్య, లక్ష్మీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సమయ

హుస్సేన్‌పీరాకు ఘన సన్మానం

కంభం, ఆగస్టు 4 : ఉభయ తెలుగురాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని టీడీపీ సోషల్ మీడియా వీరసైనికులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు సయ్యద్ హుస్సేన్‌పీరాను ఘనంగా సన్మానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన ఆ పార్టీలో పనిచేస్తున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా హుస్సేన్‌పీరాను సన్మానించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌పీరా మాట్లాడుతూ మనిషికి స్నేహితులు అవసరమన్నారు. స్నేహితుడు లేని జీవితం వ్యర్థమన్నారు. టీడీపీ గురించి మాట్లాడుతూ ఈరోజు ఇంతమంది సోషల్‌మీడియా ప్రతినిధులు రావడం, తనను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. దివంగత ఎన్‌టీఆర్ ఆశీస్సులతోనే తనకు ఈ గౌరవం దక్కిందన్నారు. తాను పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ గుంటూరు జిల్లా తెలుగు మహిళ కార్యదర్శి లక్ష్మీగణేష్, రావెళ్ల ఉదయ్‌కుమార్ తనను ప్రత్యేకంగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


ఎన్‌టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న హుస్సేన్‌పీరా

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

- ఇరువురికి తీవ్రగాయాలు

పెద్దదోర్నాల, ఆగస్టు 4: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన శ్రీశైలం- దోర్నాల ఘాట్‌రోడ్డులో మండలంలోని చుట్టుతాండా వద్ద ఆదివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ప్రమాదంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మోదుకొండవారి పాలెం గ్రామానికి చెందిన వంశీకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. వీరు మోటారు సైకిల్‌పై శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా చట్టుతాండా వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలకు దారివ్వబోయి వేగం అదుపు తప్పి ప్రక్కనే ఉన్న రక్షణ గోడకు ఢీ కొట్టారు. దీంతో ప్రమాదం జరిగింది. గమనించిన ప్రయాణికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఆంబులెన్స్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం- ఉపకరణాల దగ్ధం

ఎర్రగొండపాలెం, ఆగస్టు 4 : ఎర్రగొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల స్టాకు గదిలో ఆదివారం విద్యుత్తు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయి 2లక్షల మేర నష్టం వాటిల్లింది. స్టాక్ గదిలో ఉన్న విద్యుత్తు మీటరు నుంచి వచ్చిన మంటలు పేపర్లు అంటుకొని అదే గదిలో భద్రపరిచిన డిజిటల్ ప్రొజెక్టరు, నాలుగు కంప్యూటర్లు, విద్యార్థుల ఎక్జామ్ సీట్లు, మంటల్లో కాలిపోయినట్లు ఎంఈవో పి ఆంజనేయులు తెలిపారు. విద్యుత్తు సర్క్యూట్‌తో ఏర్పడిన మంటలను ఉదయం 11 గంటల సమయంలో కాపలదారుడు షేక్‌ఖాశీం సాహెబ్ గమనించి హెచ్‌ఎంకు, ఉపాధ్యాయులకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో ఉపాధ్యాయులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపు చేసినట్లు ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయుల రికార్డులు కాలిపోయినట్లు తెలిపారు.


దగ్ధమైన రికార్డులు కంప్యూటర్లు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఆగస్టు 4: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. స్థానిక ఎస్సై కె.విజయ్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు.. ముండ్లమూరు, ఆగస్టు 4: మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న గ్రామ దేవతలైన పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరు, నూజెండ్లపల్లి, పసుపుగల్లు, పెదఉల్లగల్లు, బొప్పూడివారి పాలెం గ్రామాల్లో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

డిగ్రీ ఫలితాల్లో గౌతమి విద్యార్థుల ప్రతిభ

దొనకొండ, ఆగస్టు 4: ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో విడుదలైన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో దొనకొండ గౌతమి డిగ్రీ కాలేజీ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబర్చినట్లు కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో షేక్ షమీమా 665 మార్కులు, గాజుల నరసింహరాజు 583 మార్కులు, ఎం.వెంకటపద్మజ 555 మార్కులు సాధించారు. బీఏ విభాగంలో మేళం ఉదయ్‌కిరణ్ 480 మార్కులు, పఠాన్ ఆఫ్రిన్‌ఖాన్ 461 మార్కులు, షేక్ అబ్దుల్ అజీజ్ 458 మార్కులను సాధించినట్లు తెలిపారు. ప్రతిభచాటిన విద్యార్థులను గౌతమి విద్యాసంస్థల అధినేత కె.గుండారెడ్డి, సీఈవో నాగేంద్రబాబు, ప్రిన్స్‌పాల్ గోపి, అధ్యాపక బృందం అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు, ఆగస్టు 4: మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం ఎస్‌ఐ వి.నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. వీరినుంచి రూ.11,030 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తున్నట్టు ఆయన తెలిపారు. దాడుల్లో రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మహేష్, ప్రేమానిధి, మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ డీవీ మనోహర్

పామూరు, ఆగస్టు 4: రక్తదానం ప్రాణదానంతో సమానమని సూర్యచంద్ర సేవాసంస్థ అధ్యక్షుడు దరిశి మనోహర్ అన్నారు. స్థానిక పద్మావతి అతిథి గృహంలో ఆసంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు సేవా బ్లడ్ బ్యాంక్ సహకారంతో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వా సవీమాత దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, టీచర్ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

పామూరు, ఆగస్టు 4: సీపీఐని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక జీవైఆర్ భవన్‌లో పాలపర్తి మస్తాన్‌రావు అధ్యక్షతన జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రజా ఉద్యమాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీకి ఆదరణ తగ్గుతుందని చెప్పారు. దాంతో దక్షిణాది రాష్ట్రాల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి తమ బలాన్ని పెంచుకునేందుకు యత్నిస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వాడవాడలా జరపాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ యాసిన్, జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

ఒంగోలు(క్రైం), ఆగస్టు 4: పోలీసుశాఖలో పనిచేస్తున్న సిబ్బంది సక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పోలీసు కల్యాణమండపంలో మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందఽరర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఒత్తిడి, ఆందోళనకు గురవుతుంటారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే పోలీసులు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కాగా వైద్యశిబిరంలో ఉపాస్ స్పెషాలిటీ హాస్పటల్ డాక్టర్లు ఉమాపతిచౌదరి, కె.అనిల్, యు.శ్రీనివాస్, పోలీసు యూనిట్ ఆసుపత్రి డాక్టర్ భానుమతి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యోగా బాలబాలికల జట్ల ఎంపిక

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 4: ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగా బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.శివాజీ, డీఎల్.కిరణ్మయి ప్రకటించారు. ఆదివారం ఒంగోలులో 8 నుంచి 25 సంవత్సరాల వయస్సుకు సంబంధించి వేర్వేరుగా జట్లు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో టీవీ.చైతన్య, గొల్లపల్లి బద్రీనాథ్, కె.సుందర్పాల్, సూఫుద్దీన్ ఖాన్, ఎం.వెంకటేష్, పీవీ.వీరాంజనేయులు, వరుణ్‌సాయి, కె.భార్గవ్, కె.భరత్‌కుమార్‌రెడ్డి ఎస్.సిద్ధిసాయిబాబా, బి.భాస్కర్‌రావు, బాలికల విభాగంలో వీవీ.హర్షిణి, సీహెచ్.శిమన్విత, ఎ.లిఖిత, ఎస్.గ్రేష్మీ, ఎస్.శృతి, ఓవీ.రేణుక, కె.శాంతి, కె.క్రాంతిప్రసన్న, ఎ.ఉదయ్‌శ్రీ, శ్వేత, ఎన్.చిన్మయిసాయిచంద్ర, యు.సుశీల, ఎంపికయ్యారు. అలాగే 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు విభాగంలో ఎస్.రాధ, బి.ప్రశాంతి ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.

మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 4: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం అద్దంకి బస్టాండులోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మహాసభకు బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ చట్టాలకు అనుగుణంగా రాష్ట్రంలో జీవో నెంబరు 21 రవాణా కార్మికులపై కత్తిలాగా పనిచేస్తుందన్నారు. చలానాలు, జరిమానాలు రోజువారీ కార్మికులపై పడుతుందని ఆరోపించారు.

టీచర్ల సర్దుబాటును నిలిపివేయాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 4 : రాష్ట్ర పాఠశాల విద్యాకమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో చేయనున్న టీచర్ల సర్దుబాటును నిలిపివేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఆదివారం ఒంగోలులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పి.జనార్దన్ రెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలల దుస్థితికి కారణమైన 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు మాట్లాడుతూ గతంలో జరిగిన టీచర్ల సర్దుబాటు వల్ల జరిగే ఇబ్బందులను జిల్లా, మండల స్థాయి అధికారులు పరిష్కరించేవారన్నారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా రాష్ట్ర స్థాయిలో కమిషనర్ సర్దుబాటు నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల, నాయబ్‌రసూల్, శేషారావు, తిరుమల, హనుమంతరావు శేషిరెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసవుతున్న యువత

- దర్శి ప్రాంతంలో జోరుగా పేకాట, బెట్టింగులు
- అప్పుల పాలై ఛిద్రమవుతున్న కుటుంబాలు

దర్శి, ఆగస్టు 4: దర్శి ప్రాంతంలో పేకాట, బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. శివారుప్రాంతాల్లో లక్షలాది రూపాయల పేకాటలు ముమ్మరంగా సాగతున్నాయి. కొంతమంది అక్రమార్కులు పేకాటలు ఆడిస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో ఈ అక్రమమార్గాన్ని ఎంచుకుంటున్నారు. అమాయకులైన ప్రజలు పేకాటలో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలవుతున్నారు. పథకం ప్రకారం ప్రాంతాలను మారుస్తూ పేకాట ఆడిస్తున్నారు. పోలీసులకు నెలవారీ ముడుపులు చెల్లిస్తుండటంతో అక్రమార్కులకు సహకరిస్తున్నారు. దీంతో పేకాటరాయుళ్లకు పూర్తి భరోసా ఇస్తూ ఆటలాడిస్తున్నారు. ఇతరప్రాంతాల నుంచి కూడా పేకాట ఆడేందుకు ఇక్కడికి వస్తున్నారు. కొద్దిరోజులక్రితం తాళ్లూరు మండలంలోని లక్కవరం పొలాల్లో పేకాట ఆడుతూ పులువురు పట్టుబడిన విషయం విదితమే. అంతకుముందు దర్శి, కురిచేడు ప్రాంతాల్లో కూడా పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు.

పోలీసులు గ్రామాల్లో చిన్న చిన్న ఆటలు ఆడేవారిని పట్టుకుంటూ పెద్ద ఆట ఆడేవారి జోలికి వెళ్లటం లేదు. కొద్దినెలల క్రితం కురిచేడు శివారు ప్రాంతాల్లో జోరుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో జిల్లా నుంచి స్పెషల్ స్క్వాడ్ వచ్చి పట్టుకున్నారు. పల్నాడు ప్రాంతానికి చెందిన జూదరులు వచ్చి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో కాపు కాసి పట్టుకున్నారు. అక్కడ స్థానిక పోలీస్ అధికారి పేకాట ముఠాకు సహకరిస్తున్నారని వీఆర్‌కు పంపారు. పేకాట వల్ల అనేక మంది డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలై ఆస్తులు అమ్ముకుంటున్నారు.

ముమ్మరంగా బెట్టింగులు

దర్శి ప్రాంతం బెట్టింగ్‌లకు నిలయంగా మారింది. ఏసందర్భం వచ్చినా కోట్లాది రూపాయలు బెట్టింగులు నడుస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలపై రూ.వంద కోట్లకు పైగా బెట్టింగులు నడిచినట్లు సమాచారం. ఈ బెట్టింగ్‌లో అనేక కుటుంబాలు లక్షలాది రూపాయలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. కొందరు వ్యాపారుల వద్ద మధ్యవర్తులు డబ్బులు నిల్వ చేయగా, ఆడబ్బులు తీసుకుని కొందరు పరారయినట్ల సమాచారం. దీంతో బెట్టింగ్‌లు పెట్టించిన మధ్యవర్తులు సర్దుబాటు చేయలేక లబోదిబో మంటున్నారు. అధిక శాతం మధ్యవర్తులు బెట్టింగ్‌లు పెట్టించినందుకు వచ్చిన కమీషన్‌తో లక్షలాది రూపాయలు సంపాదించారు. కోట్లాది రూపాయల బెట్టింగులు నడిచినా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో అమాయక ప్రజలు బలయ్యారు.

క్రికెట్ బెట్టింగులు విపరీతంగా జరుగున్నాయి. ఏ మ్యాచ్ ఆరంభమైనా ఇక్కడ లక్షలాది రూపాయల బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కొంతమంది యువతను ఆకట్టుకుని ముగ్గులోకి దించుతున్నారు. యువత బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. అప్పులు తీర్చాలని తల్లిదండ్రులపై గొడవలు చేస్తున్నారు. సామాన్య కుటుంబాలు బెట్టింగ్‌ల వల్ల ఛిద్రమై పోతున్నాయి. ఇరువురు వ్యక్తులు బెట్టింగ్‌ల్లో కీలంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఆ వ్యక్తులు పోలీసులను మేనేజ్ చేస్తూ జోరుగా బెట్టింగ్‌లు సాగిస్తున్నారు.

గతంలో పోలీసులు బెట్టింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి అనేక మందిపై కేసులు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ వ్యాపారాలకు అడ్డే లేకుండాపోయింది. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో వీటికి అడ్డుకట్ట పడుతుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించిన తరువాత పేకాట, బెట్టింగు తదితర అక్రమ వ్యాపారాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ సచివాలయ భవనం తెరిపిస్తాం!

తాళ్లూరు, ఆగస్టు 4: తురకపాలెం గ్రామ సచివాలయ భవనాన్ని తెరిపిస్తామని ఏఈఎం వెంకటేశ్వరరావు తెలిపారు. కాంట్రాక్టర్ నుంచి భవనం తాళం తీసుకొని తెరిపిస్తామని పేర్కొన్నారు. తురకపాలెం సచివాలయం వినియోగంలోకి వచ్చేనా! శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. మండల ఏఈఎం వెంకటేశ్వరరావు ఇందుకుసంబంధించి అధికారులకు నివేదించారు. గ్రామ సచివాలయ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.13 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికీ రూ.27 లక్షలు చెల్లించినట్టు చెప్పారు. సదరు కాంట్రాక్టర్‌ను అనేకమార్లు తాళం ఇవ్వమని కోరినా స్పందించలేదన్నారు. బిల్లులు రావాలంటూ తాళం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాన్ని తెరిపిస్తామని ఉన్నతాధికారులకు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 4: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వ హించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకాలు చేశారు. అనంతరం మేళతాళాలతో స్వామివారికి మహానైవేధ్యం సమర్పించారు. గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజలు నిర్వహించి భక్తులకు నైవేధ్యం అందజేశారు.

మాన్యం భూములపై దేవస్థానానికే సర్వహక్కులు

- అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి



పామూరులోని నెల్లూరు రోడ్డులో గల దేవస్థాన భూమిలో బోర్డును ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

పామూరు, ఆగస్టు 4: పామూరులోని శ్రీమదన వేణుగోపాలస్వామి, శ్రీ వల్లీభుజంగేశ్వరస్వామి, శ్రీవరదరాజుల స్వామి, శ్రీఆంజనేయస్వామి దేవ స్థానాలకు చెందిన మాన్యం భూములపై దేవస్థానానికి సర్వహక్కులు ఉం టాయని ఒంగోలు ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్దన్‌రెడ్డి పేర్కొ న్నారు. కమిషనర్ ఆదేశాలతో పామూరు పట్టణంలోని సర్వే నెంబర్ 256/ 1,2. 441/1,2,3, 442/ 1,2,3, వేంపాడు గ్రామ పరిధిలో గల సర్వే నెంబర్ 78/1లో గల దేవస్థాన భూముల్లో, విరువూరు రోడ్డులో గల దేవస్థాన భూముల్లో సిబ్బంది బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ భూములు ఆలయాలకు సంబంధించినవని, ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరిస్తూ దేవస్థాన ఈవో గిరిరాజు నరసింహబాబు బోర్డులు ఏర్పాటుచేశారు.

దేవదాయ శాఖ సమర్పించిన రికార్డుల ప్రకారం నెల్లూరు జిల్లా వరికుంటపాడు రెవెన్యూ పరిధిలో గల వేంపాడు గ్రామ సర్వే నెంబర్ 78/1లో 6.08 ఎకరాల భూమి పామూరు మదన వేణుగోపాల స్వామి దేవస్థానానికి చెందినదిగా కోర్టు అభిప్రాయపడింది. అందుకనుగుణంగా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేయాలని వరికుంటపాడు తహసీల్దార్‌ను జేసీ కోర్టు ఆదేశించిందని అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్దన్‌రెడ్డి తెలిపారు. 22ఏ 1సి రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని ఆలయ నిషేధిత ఆస్తుల జాబితాలో సర్వే నెంబర్ 78/1ని చేర్చడానికి నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ ప్రతిపాదనను సమర్పించాలని కార్యనిర్వహణాధికారిని కోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈక్రమంలో మాన్యాలు అమ్ముకొన్నవారు, అట్టి భూములను కొనుగోలు చేసినవారు బోర్డులు ఏర్పాటు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా పట్టణ నడిబొడ్డున దేవస్థానానికి చెందిన షాపులకు త్వరలో వేలం పాట నిర్వహిస్తామని నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడంతో అలజడి నెలకొంది.



ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 4: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మున్సిపాల్టీలో ప్రజలకు నీటి సరఫరా కోసం ప్రముఖ వైద్యులు గురుబ్రహ్మం జ్ఞాపకంగా ఆయన కుటుంబసభ్యులు అందచేసిన నీటి ట్యాంకర్‌ను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా నీటి సమస్య ఉందని చెప్పారు. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టినట్టు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులను అనతి కాలంలోనే రాబట్టి కనిగిరిలో ఇంటింటికి తాగునీటి కుళాయిలను వేయిస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రముఖ వైద్యులు తనయులు చప్పరం వాసు లాంటి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు.

కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిరంజీవి (వీవీఆర్ మనోహరరావు), సానికొమ్ము తిరుపతిరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, షరీఫ్, సామిల్ అబ్దుల్, గంగిరెడ్డి, కేవీఎస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో కరివేపాకు రైతులు

- దిగజారిన ధరలు
- కిలో రూ.2కు కొనుగోలు చేస్తున్న దళారులు
- కోత కూలి కూడా రాకపోవడంతో వదిలేస్తున్న వైనం



పసుపుగల్లులో సాగు చేసిన కరివేపాకు

ముండ్లమూరు, ఆగస్టు 4: మండలంలోని పలు గ్రామాల్లో కరివేపాకు సాగుచేస్తున్న రైతులు కష్టాల పాలవుతున్నారు. మార్కెట్‌లో ధర రోజురోజుకు పతనమవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవటంతో చేసేదేమిలేక తోటలను కొంతమంది దున్ని వేస్తున్నారు. మరికొంతమంది వచ్చిందే దక్కుదలని విక్రయిస్తున్నారు. వాస్తవానికి కరివేపాకు సాగు చేసిన రైతులు ఏడాదికి మూడుసార్లు ఆకు దిగుబడి వస్తే వాటిలో ఒక్కసారే ఆశించిన విధంగా ధర ఉంటుంది. మిగతా రెండుసార్లు వచ్చే దిగుబడి నష్టాలే చవిచూస్తున్నాయి. ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర లేకపోవటంతో నష్టాలు మూట గట్టుకుంటున్నారు. మండలంలోని పసుపుగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం, రెడ్డినగర్, పెదఉల్లగల్లు, శంకరాపురం, మారెళ్ళ గ్రామాల్లో కరివేపాకు తోటలు విపరీతంగా సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేదని చెప్పి దళారులు కేవలం కిలో రెండు రూపాయలకు కొనుగోలు చేస్తామని చెబుతుండటంతో చేసేదేమిలేక కొంతమంది రైతులు అమ్మివేస్తున్నారు. మరికొంతమంది రైతులు తోటల్లోనే కోసి పడవేస్తున్నారు. గుంటూరు, విజయవాడ, ఒంగోలు, నరసరావుపేట, మార్టూరు, పొదిలి, వినుకొండ ప్రాంతాలకు చెందిన కొంతమంది దళారులు వచ్చి రైతులను మభ్యపెట్టి అమ్మకాలు చేస్తున్నారు. వరుసగా ఐదు సంవత్సరాల నుంచి కరివేపాకు తోటలు సాగుచేస్తున్న రైతులు నష్టాలపాలవుతున్నారు.

పశువుల బీడుభూమి ఆక్రమణ

- గత వైసీపీ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్
- రెవెన్యూ అధికారుల నిర్వాకం
- పాపిరెడ్డిపల్లి గ్రామస్థుల ఆందోళన



ఆక్రమణకు గురైన బీడు భూమి

వెలిగండ్ల, ఆగస్టు 4: గత వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీ నాయకుల అండచూసుకుని యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. ఈక్రమంలో ప్రభుత్వ భూములు, బీడు భూములు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు కొంతమంది ఏకంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో వైసీపీ నాయకుల ఆక్రమణలు వెలుగుచూస్తున్నాయి. వెలిగండ్ల మండలం కంకణపాడు పంచాయతీలోని పాపిరెడ్డిపల్లి రెవెన్యూలో పది ఎకరాల పశువుల బీడు భూమిని ఆక్రమించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి ఆన్‌లైన్ కూడా చేయించారు. కంకణంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 104-5లో వెయ్యి ఎకరాల పశువుల బీడు భూమి ఉంది. హనుమంతునిపాడు మండలం నందనవనంకు చెందిన షేక్ నాసర్ ఖాతా నెంబర్ 3014 సృష్టించి రిజిస్ట్రేషన్ నెంబర్ 8853-2024 మీద కనిగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నాలుగు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈక్రమంలో నాలుగు రోజుల క్రితం పశువుల బీడు భూమిలో యంత్రాల సహాయంతో చెట్లను తొలగించి చదును చేస్తుండటంతో పాపిరెడ్డిపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈభూమి నాకు ఆన్‌లైన్ అయింది, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నానని షేక్ నాసర్ తెలపడంతో గ్రామస్థులు కంగుతిన్నారు. ఇందుకుసంబంధించి గ్రామస్థులు మేడం మహేష్ రెడ్డి, బాలయ్య, పిచ్చిరెడ్డి, తదితరులు శనివారం తహసీల్దార్‌కు బీడు భూమి ఆక్రమణపై వినతిపత్రం అందజేశారు.

నిబంధనలకు పాతర

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పశువుల బీడు భూమికి పట్టాలు ఇవ్వరాదు, ఆన్‌లైన్ చేయకూడదు. ఇవేమి రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. లక్షల రూపాయలు ముడుపులు తీసుకొని ఇష్టానుసారంగా ఆన్‌లైన్ చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలో భూఆక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

గుంతలమయం..
ఇండ్లచెరువు రహదారి

- ఐదేళ్లు గాలికొదిలేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలమయమైన ఇండ్లచెరువు ప్రధాన రహదారి

దొనకొండ, ఆగస్టు 4: దొనకొండ నుంచి ఇండ్లచెరువు మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి కనీస మరమ్మతులకు నోచుకోలేదు. అడుగుకో గుంతతో వాహనచోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, భూమనపల్లి, చిలకలపల్లి, మంగినపూడి తదితర గ్రామాలకు చెందిన ప్రజలేకాక, ఇతరప్రాంతాల నుంచి మార్కాపురం వెళ్లే వాహన చోదకులు సైతం ప్రతిరోజు వందల సంఖ్యలో ఈమార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా మారటంతో వాహనదారులకు ప్రాణసంక టంలా మారింది. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై ఎక్కడ గుంత ఉందో, లేదో తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.


వైసీపీ పాలనలో ఐదేళ్ల ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో రోడ్డు పరిస్థితి దారుణంగా మారిందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. రోడ్డు గుంతలమయం కావటంతో వచ్చిన ఆదాయం వాహనాల మరమ్మతులకే సరిపోతుందని పలువురు డ్రైవర్లు, వాహనాల చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఈ రహదారికి మరమ్మతులు జరుగుతాయని ప్రయాణికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు అధ్వానంగా తయారైన ఇండ్లచెరువు రహదారికి మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 5 ఆగస్టు 2024





కొత్త పింఛన్లు ఎప్పుడో..?

- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- దరఖాస్తు ప్రక్రియను కష్టతరం చేసిన వైసీపీ
- గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ఎంపిక


గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు నమోదు చేయించుకునే అవకాశం ఉండేది.. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇదే పెద్ద ప్రహసనంలా మారింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే నమోదుకు అవకాశం దక్కేది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో తమకు అవకాశం ఎప్పటికి దక్కుతుందో.. ఎప్పటి నుంచి పింఛన్ల లబ్ధి పొందుతామని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తోన్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశంపై కొండంత ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశంలేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. దానికి తోడు పింఛను మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచేసింది. మరోవైపు వైసీపీ హయాంలో నిబంధనల వడపోతతో అనర్హత బారినపడి పింఛన్లు కోల్పోయిన వేలాది మంది అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వెరసి పింఛన్ల కోసం ఎదురు చూసేవారి సంఖ్య భారీగా పెరిగింది.

నిరంతర ప్రక్రియగా నాడు నమోదు

2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానం తెచ్చింది. ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్క సారి కూడా ఆ ప్రకారం జాబితాలను రూపొందించిన దాఖలాలు లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే వైసీపీ ప్రభుత్వం తొలగింపులను నిరంతర ప్రక్రియగా చేసుకుంది. విద్యుత్, ఇన్‌కమ్ టాక్స్, నాలుగు చక్రాల వాహనం, ఇళ్ల స్థలం, పొలం తదితరాల పేరుతో వేలాదిమందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించారు. పొరపాటున తిరస్కరణకు గురైతే మరో ఆరు నెలలు ఆగాల్సి వచ్చేది. ఇలా అర్హులైన లబ్ధిదారులు వేలాది మంది ఏళ్లకు ఏళ్లు పింఛను కోల్పోయిన పరిస్థితి ఉంది. ఇలాంటి వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు.

నిర్ణయంపై ఎదురు చూపులు

కొత్త పింఛన్లపై కూటమి ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. అనేక మంది ఒక చోట నుంచి వేరొక చోటికి మారినవారు ఉన్నారు. వారు కూడా పింఛనును తాము ప్రస్తుతం నివాసం ఉండే చోటికి బదిలీ చేసుకోవాలని చూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.



సమగ్రంగా సిద్ధం

- నివేదికలు రూపొందించిన కలెక్టర్లు
- నేటి సదస్సుకు ప్రాధాన్యాల కనుగుణంగా కసరత్తు
- సీఎం చంద్రబాబుతో తొలి సమావేశానికి కలెక్టర్లు, ఎస్పీలు
- జిల్లాలోని పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలు పవర్ పాయింట్ ప్రజంటేషన్

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న పరిస్థితులు.. అవసరాలు.. ప్రభుత్వ పరంగా తీసు కోవాల్సిన చర్యలు.. జిల్లా అవసరాలు.. అభివృద్ధి.. సమస్యలు తదితరాలపై కలెక్టర్లు సమగ్రంగా నివేదికలతో సోమవారం జరిగే కలెక్టర్ల సదస్సుకు సిద్ధమయ్యారు. ఇక శాంతిభద్రత లు.. గంజాయి.. తదితరాలపై కసరత్తు చేసిన ఎస్పీలు ముఖ్యమంత్రి సమావేశానికి హాజరు కానున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రప్రథమంగా కలెక్టర్ల సదస్సు సోమవారం రాష్ట్ర సచివాయలంలో జరగనుంది. దీనికి సంబందించి ఇప్పటికే కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. దీంతో సమావేశంలో చర్చించబోయే వివిధ శాఖలకు సంబందించిన కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమాచారాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారుల నుంచి తెప్పించుకున్నారు. ఏయే రంగాలు ఐదేళ్లలో పూర్తిగా పడకేశాయి.. వేటిపై తక్షణమే దృష్టిసారించాలి.. నిధుల లభ్యత.. ఆయా విభాగాల ప్రస్తుత పరిస్థితులపై కసరత్తు చేసి కలెక్టర్లు నివేదికలను తయారు చేశారు. కలెక్టర్ల సదస్సుకు సన్నాహకంగా జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు కూడా ఇప్పటికే నిర్వ హించారు. ఆయా శాఖల అధికారుల నుంచి పూర్తి సమాచా రాన్ని తీసుకుని సమగ్రమైన నివేదికను రూపొందించు కున్నారు. ఈ సదస్సుకు సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ, రెవెన్యూ, ఆర్థిక శాఖ మంత్రులు అనగాని సత్యప్ర సాద్, పయ్యా వుల కేశవ్ హాజరుకానున్నారు. సమావేశంలోనే కలెక్టర్లకు లక్ష్యాలను కూడా నిర్దేశించనున్నట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ల సదస్సులు మొక్కుబడిగా జరిగేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్ల సదస్సులకు శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తొలి కలెక్టర్ల సదస్సుకు జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లతో హాజరు కానున్నారు. సీఎంతో సమావేశం ఖరారు కాగానే ఆయా శాఖల పరిస్థితిపై అధికారులతో బాపట్ల కలెక్టర్ వెంకటమురళి మూడు రోజులపాటు వరుసగా సమావేశమయ్యారు. గృహనిర్మాణశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖల పై సమగ్ర వివరాలు తెప్పించుకున్నారు. ఏళ్లగా పేరుకుపోయిన సమస్యలతో పాటు ఆయా శాఖల ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితితో పాటు గంజాయి నియంత్ర ణకు గతంలో తీసుకున్న చర్యలతో పాటు భవిష్యత్తులో చేపట్ట బోయే యాక్షన్ ప్లాన్‌పై ఎస్పీ పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యారు. జిల్లాలో ఉన్న సహజ వనరులు, ఉద్యోగ, ఉపాధి రంగాలకు ఉన్న అవకాశాలు, పరిశ్రమలు, నిర్మాణ రంగంలోకి పెట్టుబడులు తదితర అంశాలపై కలెక్టర్ నాగలక్ష్మి ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్న తీరు, కొత్తగా తవ్వకాలకు గుర్తించిన ప్రదేశాలను కూడా వివరించనున్నారు. వివిధ శాఖల అధికారు లతో రెండు రోజుల నుంచి స మావేశాలు నిర్వహిస్తూ సమగ్ర సమాచారాన్ని తెప్పించుకున్నారు. వాటిని పీపీటీ రూపంలో సదస్సులో నివేదించనున్నారు. బాపట్ల, రేపల్లెలో తాగునీటి సమస్య తీర్చడం అనేది ప్రాథమ్యాల జాబితాలో కలెక్టర్ చేర్చి నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి అద నపు స్టోరేజీ ట్యాంకుల అవసరంపై నివేదికలు తయారు చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా జిల్లాలో ఖజానాపై ఎంత భారం పడనుందనేది కూడా వివరించనున్నారు. బాపట్ల లో నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పట్టా లెక్కించడంపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. చీరాలలో హ్యాండ్ లూమ్ పార్కు, ఆక్వాపార్కు నిర్మాణం తదిత రాలపై నేటి సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

సదస్సు ఇలా..

జిల్లాలను ప్రగతిపథంలో నిలబెట్టే కీలక భూమికని పోషించే కలెక్టర్లకు ప్రభుత్వ ప్రాధాన్యాంశాలను తెలియజేసి వాటి అమలుకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు సీసీఎల్‌ఏ జయలక్ష్మి ప్రారంభోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత చీఫ్ సెక్రెటరి, రెవెన్యూఆర్థిక, ఉపముఖ్య మంత్రులు ప్రసంగిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు సీఎం చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత 11 నుంచి 12 గంటల మధ్యన ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, పశుసంవర్ధకం, మత్స్య, అటవీ, ఉద్యాన శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. 12.10 నుంచి 1 గంట వరకు సంక్షేమ శాఖల కార్యకలాపాలపై సమీక్షిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం ఆరోగ్య, సీజనల్ పరిస్థితులపై చర్చిస్తారు. ఆ తర్వాత ప్రాథమిక, సెకండరీ, హయ్యర్ ఎడ్యుకేషన్‌పై సమీక్ష ఉంటుంది. అనంతరం మున్సిపల్ పరిపాలన, సీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్), హౌసింగ్, జలవనరులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు. విద్యుత్‌చ్ఛక్తి, రెవెన్యూ(భూములు, రిజిస్ట్రేషన్, స్టాంపులు, ఎక్సైజ్) శాఖలపై సమీక్షిస్తారు. సమావేశం ఆఖరులో గంటన్నర పాటు శాంతిభద్రతల అంశంపై ఎస్పీలతో సమీక్షిస్తారు. ఈ సమావేశానికి డీజీపీ కూడా హాజరుకానున్నారు. సాయంత్రం 6.30 గంటలకు స్పెషల్ చీఫ్ సెక్రెటరి ముగింపు ప్రసంగంతో కలెక్టర్ల సదస్సు ముగుస్తుంది.



రుణాలు అనుమానాలు

- లోపభూయిష్టంగా జీడీసీసీ విధానం
- మిస్టరీగా మారిన రూ.53 కోట్ల రుణం మంజూరు

అక్రమంగా తీసుకున్న రుణాలతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రుణాల విషయంలో జీడీసీసీ బ్యాంకు అవలంబిస్తున్న విధానంపై అనుమానాలు నెల కొంటున్నాయి. ప్రధానంగా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మిర్చికి రుణం ఇచ్చే విషయంలో జాతీయ, ప్రైవేటు బ్యాంకులు పకడ్బందీగా వ్యవహరిస్తుండగా జీడీసీసీ తీరు లోపభూయిష్టంగా ఉన్నాయన్న విమర్శలున్నాయి. పర్సనల్ సెక్యూరిటీలు, ఆధార్‌ని సిబిల్ అకౌంట్‌కి లింకులను పట్టించుకోకుండా కేవలం కోల్డ్‌స్టోరేజ్ యజమాని ఇచ్చే బాండ్, పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా ఇబ్బడిముబ్బడిగా రుణాలు ఇస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు ఎవరెవరి పేర్లతోనో జీడీసీసీ బ్యాంకులో రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటు న్నాయి. తాజాగా జీడీసీసీ బ్యాంకులో వెలుగు చూసిన విశ్వసాయి కోల్డ్‌స్టోరేజ్ ఉదంతం కూడా ఇంచు మించు ఇలాంటిదే. గత ఏడాది, ఈ సంవత్సరం మిర్చి సీజన్ మందకొడిగా సాగింది. రైతులు ఆశిం చిన ధర మార్కెట్‌లో లభించలేదు. దాంతో రైతులు, కొంతమంది వ్యాపారులు దాదాపుగా 70 లక్షల మిర్చి టిక్కీలను కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేశారు. మిర్చి మార్కెట్ ఊపందుకోకపోతుండటంతో కొంతమంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. జాతీయ, ప్రైవేటు బ్యాంకులు అయితే రుణం ఇచ్చేముందు విచారణ అధికారులతో అన్ని వివరాలు సేకరిస్తాయి. కోల్డ్‌స్టోరేజ్ వద్దకు రైతు తప్పనిసరిగా రావాలి. అలానే నిల్వ చేసిన స్టాకు, వెరైటీ, నాణ్యతని పరిశీలిస్తారు. పట్టాదారు పాసుపుస్తకం, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం జారీ చేసిన బాండ్ పేపర్‌ని తీసుకుని రైతుతో వేలిముద్ర వేయిస్తారు. అలానే పర్సనల్ సెక్యూ రిటీ కింద స్థిరాస్తిని కూడా తనఖా పెట్టుకుంటారు. సిబిల్ అకౌంట్‌తో ఆధార్‌ని లింక్ చేయడం వల్ల సంబంధిత రైతు/వ్యాపారి మరో బ్యాంకు నుంచి రుణం తీసుకునే అవకాశం ఉండదు. ఈ విధంగా ఎంతో పకడ్బందీగా వ్యవహరిస్తారు. అయితే జీడీసీసీ బ్యాంకు విషయానికి వచ్చేసరికి చైర్మన్ ఏది చెబితే అది ఆ బ్యాంకు శాఖల అధికారులు పాటిస్తారు.

నకిలీలతో రుణాలు.. మరుగున పరిచే యత్నాలు

జీడీసీసీ బ్యాంకు నల్లపాడు బ్రాంచ్‌లో వెలుగు చూసిన కుంభకోణం మరుగునపరిచే ప్రయత్నాలు పెద్దఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు న్నాయి. ఒక కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన సరుకుకు రూ.53 కోట్ల రుణం ఎలా ఇచ్చారనేది మిస్టరీగా మారింది. దాదాపుగా 150 మంది రైతుల పేర్లతో ఈ రుణాలు తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతోన్నాయి. ఈ క్రమంలో కొందరి ఆధార్‌లు, పట్టాదారు పాసుపుస్తకాలు నకిలీవి సృష్టించి బ్యాంకు నుంచి రుణం పొందారు. అసలు పొలం లేని వ్యక్తుల పేర్లతో రుణం మంజూరైందంటే నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు కూడా సృష్టించి ఉంటారని తెలుస్తోంది. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు కూడా రుణాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించారు. కాగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణంతో తాడికొండ, అమరావతి రాజధాని పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టినట్లు భోక్తలపై ఆరోపణలు వస్తున్నాయి. వట్టిచెరుకూరుకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఆందోళనతో ఆయన పేరు మీద తీసుకున్న రుణం రూ.10 లక్షలు తిరిగి చెల్లించేశారు. అంతమాత్రాన జరిగిన నేరాన్ని కప్పి పెడతారా అని టీడీపీ శ్రేణులు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై విజిలెన్స్ సహకార శాఖ అధికారులు విచారణలు జరిపితే అసలు సూత్రధారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాయి.



నిండుకుండలా నాగార్జున సాగర్ జలాశయం

576 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

సాగర్ నీటి విడుదల నేడే

- 576 అడుగులు దాటిన జలాశయ నీటి మట్టం
- ఉదయం 8 గంటలకు గేట్లు తెరిచేందుకు ఏర్పాట్లు
- నదీ తీరంలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి), మాచర్ల రూరల్, రెంటచింతల, ఆగస్టు 4: ఉరకలెత్తుతూ ప్రవహిస్తోన్న కృష్ణమ్మ.. నాగార్జున సాగర్ జలాశయానికి చేరుతోంది. సాగర్ జలాశయం నిండు కుండలా మారింది. వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో సోమ వారం ఉదయం 8 గంటలకు సాగర్ క్రస్ట్ గేట్లు తెరవనున్నారు. ఇందుకోసం జలవనరు ల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నల్గొండ జిల్లాకు చెందిన అధికారులు క్రస్టుగేట్లను తెరవనున్నారు. సాగర్ నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరిగితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి 4,87,451 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి మట్టం గరిష్ఠ స్థాయి కొనసాగుతుండడంతో అదనంగా వస్తున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయానికి 4,27,711 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగుల కాగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు 576.10 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 271.90 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్ కుడికాల్వకు 5700 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 4613, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 26,040 క్యూసెక్కుల నీటిని సాగర్ నుంచి విడుదల చేస్తు న్నారు. డ్యాంనుంచి దిగువకు 37873 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా 3,22,817 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఇదే స్థాయిలో ప్రవాహం రానున్న వారం రోజులు కొనసాగే అవ కాశాలు ఉన్నట్లు జలవనరులశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పులిచింతలకు 25,339 క్యూసెక్కులు విడుదల



టేల్‌రేస్ ఛానల్ ద్వారా విడుదలవుతున్న నీరు

సత్రశాల వద్ద కృష్ణానది పై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు ఆదివారం 25,339 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ వెంకటరమణ చెప్పారు. 4 క్రస్ట్ గేట్లను 1 మీటర్ మేర ఎత్తి 17,048 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8291 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0469 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.05 మీటర్లు అంటే 6.7640 టీఎంసీల నీరుందన్నారు. సోమవారం సాగర్ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదల కానున్నట్లు ఎస్‌ఈ తెలిపారు.

ఈనాం ఇక్కట్లకు పరిష్కారం

- 8 దశాబ్దాల రైతుల కల సాకారం
- పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి
- రైతులకు అండగా ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 4: ఎనిమిది దశాబ్దాల ఈనాం, ఎస్టేట్ భూముల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. భూములు సాగు చేసుకుంటున్నా.. హక్కు పత్రాలు లేక అల్లాడుతున్న రైతులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొవరతో 5,010 ఎకరాల ఈనాం ఎస్టేట్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో పర్చూరు మండలం ఏదుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం, మార్టూరు మండలం లక్కవరం, జంగమహేశ్వరపురం గ్రామాలకు చెందిన 2,057 మంది రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చెన్నుంబొట్ల అగ్రహారంలో 802.71 ఎకరాలు 320 మంది రైతులు, ఏదుబాడులో 1,104.32 ఎకరాలు 430 మంది రైతులు, లక్కవరం 565 ఎకరాలు 386 మంది రైతులు, జంగమహేశ్వరపురం 2,539 ఎకరాలు 912 మంది రైతులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. 80 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర యాజమాన్య హక్కు పత్రాలు లేక పోవడంతో సన్నచిన్నకారు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవటంతోపాటు, విపత్తుల్లో పంటలు నష్టపోయినా ఎటువంటి పరిహారం అందని పరిస్థితి. వ్యవసాయ రుణాలు కూడా పొందలేకపోయేవారు. దీంతో ఆయా భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల వ్యవధిలోనే రైతుల సమస్యను ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా ముఖ్యమంతి చంద్రబాబుతోపాటు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుపోయారు. 80 ఏళ్ల సమస్యను పరిష్కరించాలని, రైతులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని ఆయన కోరారు. సమస్య పరిష్కారానికి తక్షణం చొరవ చూపాలని కలెక్టర్ వెంకటమురళి, జేసీ బి.సుబ్బారావులను ముఖ్యమంత్రి, మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం జేసీ ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్‌లతో భూములకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. రైతులకు పట్టాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని జేసీ రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితంగా తమ దశాబ్దాల కల నెరవేరనున్నదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ(ఫైల్)

నెల వ్యవధిలో రైతులకు పట్టాలిస్తాం : జేసీ

ఎన్నో దశాబ్దాలుగా నెలకొన్న ఈనాం, ఎస్టేట్ భూముల సమస్యను పరిష్కరించి నెల వ్యవధిలోనే రైతులకు పట్టాలు ఇస్తామని జేసీ బి. సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రా మాలను పర్యటించి సమస్యను తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత రైతులతో ఇప్పటికే సమావేశం నిర్వహించామన్నారు. రైతులకు మేలు చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.


పోకిరీల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

పోకిరీల పనిపట్టారు!

- మైనర్ బాలికను వేధించిన ఇద్దరు యువకులు
- స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ దామోదర్
- తాలూకా పోలీసుల అదుపులో నిందితులు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 4 : బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులను ఉపేక్షించేది లేదని బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే హెచ్చరించిన ఎస్పీ దామోదర్ ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కేసులపై ఆయన వెంటనే స్పందిస్తున్నారు. స్వయంగా రంగంలోకి కూడా దిగుతున్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో కాలనీలో మైనర్ బాలిక నూడిల్స్ తెచ్చుకునేందుకు వెళుతుండగా ఇద్దరు పోకిరీలు పూటుగా మద్యం సేవించి బైక్‌పై వెంటపడ్డారు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బయటకు వచ్చి కాపాడారు. అదేసమయంలో ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో నేరుగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులను విచారించారు. అదేసమయంలో అక్కడికి వచ్చిన తాలూకా పోలీసులు నిందితులైన చంద్రయ్యనగర్‌కు చెందిన ఎద్దూరి జయదీప్, ఎర్రగుంట్ల అనూక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఇద్దరు యువకులపై రౌడీషీట్లు తెరుస్తామని చెప్పారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీలు, గంజాయి బ్యాచ్‌పై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎన్జీవో కాలనీలో పోలీసు గస్తీ పెంచుతామని స్థానికులకు తెలిపారు. మరోవైపు ఇద్దరు యువకులకు స్టేషన్‌లో పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకు ఎస్పీ ఒంగోలులోని దిశ పోలీసు స్టేషన్ తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో ఓ మహిళ ఆయన్ను కలిసి తన కుమార్తెను ఓ యువకుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన తనభర్తపై ఆ యువకుడు స్నేహితుడితో కలిసి దాడి కూడా చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే ఎస్పీ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


గ్రామస్థులు, మహిళలతో మాట్లాడుతున్న పోలీస్ అధికారి

సింథైట్ వద్ద గ్రామస్థుల ఆందోళన

- కోరు భరించలేమంటూ నిలదీత
- దౌర్జన్యానికి దిగిన ఫ్యాక్టరీ అధికారులు

మేదరమెట్ల, ఆగస్టు 4 : మేదరమెట్ల గ్రామస్థులు సింథైట్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగారు. పదేళ్లుగా ఈ కోరును భరించలేకపోతున్నామని, మూడు రోజు నుంచి కోరు మరి విపరీతంగా వస్తోందని, వెంటనే ఫ్యాక్టరీని ఆపాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులపై ఫ్యాక్టరీ అధికారులు దౌర్జన్యానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, అలాగని మా జీవితాలను పణంగా పెట్టలేమన్నారు. 12వేల మందికి పైగా జనాభా ఉన్న మేదరమెట్లకే ఈ కోరు పరిమితం కాలేదని, చుట్టు పక్కల ఉన్న తమ్మవరం, అనమనమూరు, తిమ్మనపాలెం గ్రామాల ప్రజలు కూడా కోరుతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎన్నిసార్లు ఫ్యాక్టరీకి వెళ్లి మా బాధలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. రెండుమూడు రోజులు తాత్కాలిక పరిష్కారం తప్ప శాశ్వత పరిష్కారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇన్‌చార్జి కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఆర్డీవో తదితర జిల్లా స్థాయి అధికారులు ఫ్యాక్టరీలలో పరిశీలన చేశారు. పరిశీలనలో అనేక ఉల్లంఘనలు వారి దృష్టికి వచ్చాయి. సమస్యపై అడగడానికి వెళ్లిన గ్రామస్థులపై ఫ్యాక్టరీ అధికారులు, సిబ్బంది దౌర్జన్యాలకు పాల్పడడం పరిపాటిగా మారుతోందన్నారు. ఆదివారం కోరును తట్టుకోలేక మహిళలు, గ్రామస్థులు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. అధికారులతో మాట్లాడుతున్న సమయంలో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు గ్రామస్థులపై దౌర్జన్యానికి పాల్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీ ముందు గ్రామస్థులు నిరసన చేపట్టేందుకు టెంట్‌లు వేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్థులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీతో పాటు ఎస్ఐలు చంద్రశేఖర్, శివయ్య, తిరుపతిరావుతోపాటు జర్నలిస్టులు ఎవరినీ ఫ్యాక్టరీలోకి అనుమతించలేదు.

నేడు కలెక్టర్ల సదస్సు

- భవిష్యత్‌పై దిశానిర్దేశం చేయనున్న సీఎం
- జిల్లా అంశాలపై నివేదికలతో హాజరవుతున్న అన్సారియా

ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి జిల్లా కలెక్టర్ల సదస్సును సోమవారం నిర్వహిస్తోంది. సాధారణంగా రెండు రోజులు నిర్వహించే ఈ సమావేశాన్ని ఈసారి ఒక్క రోజుకే పరిమితం చేశారు. ఉదయం 10 నుంచి నుంచి రాత్రి 8గంటల వరకూ నిరాటంకంగా సాగేలా షెడ్యూల్‌ను రూపొందించారు. అమరావతిలోని సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చే అంశాలు, విభిన్నవర్గాల ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, జిల్లాల వారీ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానమైన వ్యవసాయం, నీటి పారుదల, సహజవనరులు, పట్టణ, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, మానవ వనరుల అభివృద్ధి, సంక్షేమం, వైద్యం తదితర తొమ్మిది రంగాలకు సంబంధించి 28 శాఖలపై సమీక్షించేలా అజెండా రూపొందించారు. రాత్రి ముగింపు సమయంలో శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఆమేరకు ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఆయా రంగాలు, శాఖల వారీ సమగ్ర నివేదికలను రూపొందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం సమావేశంలో అందజేయనున్నారు. జిల్లాకు కలెక్టర్‌గా కొద్దిరోజుల క్రితమే వచ్చిన ఆమె.. ఆయా రంగాలు, శాఖల వారీ ఒకవైపు సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలలో పలు అంశాలను గుర్తించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. రాత్రి ముగింపు సమయంలో శాంతిభద్రతలపై జరిగే సమీక్షకు ఎస్పీ దామోదర్ కూడా హాజరుకానున్నారు.

'క్లీన్'గా దోపిడీ

వైసీపీ పాలనలో క్లాప్ పేరుతో రూ. లక్షలు కైంకర్యం

మాజీ సీఎం సామాజికవర్గానికి చెందిన సంస్థకు చెత్తసేకరణ బాధ్యతలు

దానికి లబ్ధి చేకూర్చేందుకు ప్రజల నెత్తిన పన్ను భారం

మరమ్మతులకు గురై మూలనపడిన వాహనాలు

సిబ్బంది వేతనాల్లోనూ కోత

నగర వాసులకు తీరని చెత్త కష్టాలు

అయినా ఏజెన్సీకి నెలకు రూ.25లక్షలు చెల్లిస్తున్న కార్పొరేషన్ అధికారులు

పారిశుధ్యం మెరుగు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)ను తెచ్చి సొంతవారికి లబ్ధి చేకూర్చింది. క్లీన్‌గా దోచిపెట్టింది. అప్పటి సీఎం సామాజికవర్గానికి చెందిన రెడ్డి అండ్ రెడ్డి ఏజెన్సీకి చెత్త సేకరణ బాధ్యతలు అప్పగించి అప్పనంగా రూ.కోట్లు కుమ్మరించింది. నగర జనం నెత్తిన చెత్తపన్ను భారం మోపి ఆ మొత్తాన్ని సదరు ఏజెన్సీకి చెల్లించింది. అయితే ఆ సంస్థ నిర్వాహకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. తొలుత నగరంలో చెత్తసేకరణకు 60 వాహనాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణను గాలికొదిలేశాడు. దీంతో అత్యధికం మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. డ్రైవర్‌లకు నెలకు రూ.12 వేలవేతనం అంటూ పనిలోకి పెట్టుకుని రూ.9వేలు చెల్లిస్తూ వారి శ్రమను దోచేశారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు ప్రజల నుంచి నెలనెలా పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.38లక్షలను సదరు ఏజెన్సీకి చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటింటి చెత్త పన్ను వసూళ్లు నిలిపివేసింది. వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, ఇతరత్రా వ్యాపార దుకాణాల నుంచి పన్ను వసూలు మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. ఎక్కువ వాహనాలు తిరక్కపోయినా, ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించకపోయినా నెలనెలా చెత్తపన్ను ద్వారా వచ్చిన మొత్తాన్ని అధికారులు ఇప్పటికీ సదరు ఏజెన్సీకి ముట్టజెప్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 4 : గత వైసీపీ పాలనంతా అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లు సాగింది. పార్టీ నేతలకు ప్రజాధనాన్ని దోచిపెట్టడమే ధ్యేయం అన్నట్లు నడిచింది. చివరికి చెత్త సేకరణనూ సొంత వారికి ఆదాయమార్గంగా మార్చింది. క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అంటూ ప్రజలపై పన్నుల భారం మోపి ఆ సొమ్మును పందేరం చేసింది. ఒంగోలు నగర పాలక సంస్థలో క్లాప్ తీరును పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 2022 మార్చి నుంచి ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే అప్పటి నుంచి పారిశుధ్యం మెరుగు అటుంచితే భారీగా నిధుల మేత జరిగినట్లు స్పష్టమవుతోంది.

సొంత వారికి బాధ్యతలు

క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఇంటింటి చెత్త సేకరణను గత ప్రభుత్వం చేపట్టింది. అంతకుముందు ఎప్పుడూ లేని విధంగా చెత్తపై పన్ను విధించి ప్రజలపై ఆర్థికభారం మోపింది. బడి, గుడి, ఇల్లు, వాకిలి, హోటళ్లు, లాడ్జిలు, ఆసుపత్రులు, అన్నదాన సత్రాలు ఇలా ఒకటేమిటీ ప్రతి దాని నుంచీ చెత్తపన్ను వసూలు చేసింది. చెత్తసేకరణ బాధ్యతను సీఎం సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ఏజెన్సీకి అప్పగించింది. ఒప్పందం ప్రకారం సదరు ఏజెన్సీ వాహనాలను సమకూర్చుకొని ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉంటుంది. అందుకోసం డ్రైవర్‌ను నియమించుకోవాలి. ఆయనే అన్ని పనులూ చేయాలి. కానీ ఒంగోలులో కార్పొరేషన్ అధికారులు ఏజెన్సీకి అన్ని విధాలా సహకరించారు. చెత్తసేకరణ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ సిబ్బందిని కేటాయించడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది.

కదల్లేక కార్పొరేషన్ కార్యాలయంలో వాహనాలు

డ్రైవర్లకు వేతనాలు, వాహనాల నిర్వహణ, వాటి మరమ్మతులు, టైర్లు, ఇంజన్ ఆయిల్, క్లచ్ ప్లేట్‌లు, ఇతర మెయింటెనెన్స్ రెడ్డి ఏజెన్సీనే చూసుకోవాలి. కానీ ఆరంభంలో 60 వాహనాలను ఏర్పాటు చేసిన ఆ సంస్థ ఆతర్వాత వాటి గురించి అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా కొద్దిరోజులు ఆయిల్‌కు కూడా డబ్బులు ఇవ్వలేదు. ప్రస్తుతం వాహనాల్లో దాదాపు 40కిపైగా మరమ్మతులకు గురై కనీసం కదలలేని స్థితిలో కార్పొరేషన్ కార్యాలయానికే పరిమితమయ్యాయి. మరికొన్ని మూలుగుతూ, ముక్కుతూ రోడ్డెక్కుతున్నాయి. అయితే వాటి నిర్వహణ బాధ్యతపై అధికారులకు ఎలాంటి సంబంధం లేకపోవడంతో నగర పాలక సంస్థ నిధుల నుంచి ఖర్చు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు వాహన డ్రైవర్లే వాటికి మరమ్మతులు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నెలకు తమకు వచ్చే రూ.9వేల వేతనంలో రెండు, మూడు వేలు రిపేరుకే ఖర్చవుతున్నదని, ఇక తాము తినేది ఏమిటని డ్రైవర్లు వాపోతున్నారు. దీంతో కొందరు వాహనాలు నడపలేమంటూ కార్పొరేషన్‌లో వదిలేయగా, మరికొన్నింటిని అధికారులు జోక్యంతో ఎలాగోలా తిప్పుతున్నారు.


కార్పొరేషన్ కార్యాలయం వద్ద మూలనపడిన చెత్త వాహనాలు

వాహన డ్రైవర్లకు మొండిచెయ్యి

పారిశుధ్యం పేరుతో చెత్తసేకరణ వాహనాలకు డ్రైవర్లుగా విధుల్లోకి తీసుకున్న వారి సంక్షేమాన్ని ప్రైవేటు సంస్థ విస్మరించింది. క్లాప్ కింద విధుల్లోకి తీసుకున్న వారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాదు. అలాగని కాంట్రాక్ట్ కార్మికులూ కాదు. రోజువారీ కూలీలుగా తీసుకుని వారికి చెందాల్సిన కార్మిక చట్టాలను ఏజెన్సీ తుంగలో తొక్కింది. మరోవైపు ఈఎస్ఐ, ఈపీఎఫ్ కూడా లేకుండా చేసింది. క్లాప్ పేరుతో కోట్లు రూపాయలు దండుకున్న సంస్థ అటు వాహనాల నిర్వహణ, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం గత వైసీపీ పాలనలో అడ్డగోలు తీరుకు అద్దం పడుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ చెత్తపన్ను వసూళ్లను నిలిపివేసింది. కేవలం హోటళ్లు, ఆసుపత్రులు, లాడ్జిలు, ఇతరత్రా వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి మాత్రమే పన్ను వసూలు చేస్తున్నారు. ఏజెన్సీ ఏర్పాటు చేసిన వాహనాల్లో అత్యధికంగా మరమ్మతులకు గురవడంతో నగరంలో చెత్తసేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు సదరు ఏజెన్సీని కొనసాగించడం, నెలనెలా వసూలు చేస్తున్న పన్నును ఆ సంస్థకు చెల్లించడం ఆరోపణలకు తావిస్తోంది.

ఆశా'జలం'

నిండుకుండలా శ్రీశైలం, అదేస్థాయిలో సాగర్ డ్యాం

ఇప్పటికే సాగర్ జోన్-1కు నీటి విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

నేడు గేట్లు ఎత్తే అవకాశం

ఉమ్మడి జిల్లాలో 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు



ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు ప్రధాన వనరుగా ఉన్న సాగర్ నీటి సరఫరాపై రైతులు ఆశతో ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడిచినా సరైన వర్షాలు లేక పంటలు సాగు ముందుకు కదలలేదు. సాధారణ సాగు విస్తీర్ణంలో 20శాతం కూడా ఇంకా విత్తనం పడలేదు. అంతేకాక ఎండల తీవ్రత పెరిగి వేసవిని తలపిస్తుండటంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో కృష్ణానది పరవళ్లు భరోసా కలిగించాయి. పది రోజుల్లోనే శ్రీశైలం జలాశయం నిండటంతోపాటు సాగర్ డ్యాం కూడా నిండిపోయే పరిస్థితికి రావడం ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో సాగుపై రైతుల్లో నమ్మకం పెంచింది.

సాగు, తాగుకు సాగర్ నీరే ప్రధాన ఆధారం

ఉమ్మడి జిల్లాలో సాగర్ కాలువల పరిధిలో సుమారు 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా నీరు అందితే సగం విస్తీర్ణంలో మాగాణి, మిగిలిన దానిలో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఆరుతడిలో ప్రధానంగా మిర్చి, మొక్కజొన్న వంటివి ఉండగా వర్షాధారంగా వేసే శనగ, పొగాకు, పత్తి పంటలకు ఆ నీటిని పెట్టుకుంటారు. తద్వారా పంటలతోపాటు పాడి పరిశ్రమకు సాగర్ నీరు ఉపకరిస్తుంది. అలాగే అత్యధిక ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా సాగర్ నీటితోనే తీరుతుంది. అయితే గత ఏడాది కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వర్షాలు లేక సాగర్ డ్యాం నిండక ఆయ కట్టుకు నీరు రాలేదు. మాగాణి ప్రాం తంలో ఏపం టా సాగు చేసే వీలు లేక బీళ్లుగా వదిలేశారు. ఆరుతడి భూముల్లో వర్షాధారంతో కొంత మేర సాగు చేశారు. తాగునీటికి కూడా సక్రమంగా నీరందించిన పరిస్థితి లేదు.

883 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

ఈ ఏడాది తొలకరిలో కాస్తంత మెరుగ్గా వర్షం కురిసినప్పటికీ అనంతరం బెట్ట వాతావరణం కొనసాగింది. దీంతో ఖరీఫ్ ముందుకు సాగలేదు. సీజన్ ప్రారంభమై రెండు మాసాలు పూర్తయినా సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లలో కేవలం 16.80శాతంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. రైతులు భవిష్యత్ పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో కృష్ణా ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించారు. గతంతో పోల్చుకుంటే దాదాపు నెల రోజులు ముందుగానే శ్రీశైలంకు వరద నీరు రాక ఆరంభమై వారం క్రితమే గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతుండగా సాగర్ డ్యాం కూడా నిండుతోంది. ప్రస్తుత పరిస్థితిని చూస్తే శ్రీశైలం డ్యాం నీటి మట్టం 885 అడుగులు, నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 883 అడుగులకు నీటిమట్టం చేరి 204 టీఎంసీలు నిల్వ ఉంది. సుమారు 4.02 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తుండగా పది గేట్లు ఎత్తి మొత్తం దిగువకు వదులుతున్నారు. ఇక సాగర్ డ్యాం నీటి మట్టం 590 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి మట్టం 573 అడుగులు, నిల్వ 264 టీఎంసీలుగా ఉంది. ఎగువ నుంచి 3.15 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుండగా సోమవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది. దీంతో సోమవారం సాయంత్రం సాగర్ గేట్లను కూడా ఎత్తే అవకాశం ఉంది.

ముందస్తుగానే సాగునీరు విడుదల

తొలుత ఆగస్టు ఆఖరుకు సాగర్ కుడి కాలువ పరిధిలో జోన్-1కు, సెప్టెంబరు 15నుంచి జోన్2 (ఉమ్మడి ప్రకాశం జిల్లా) ప్రాంతానికి సాగు నీటిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో సాగుకు 57 టీఎంసీలు, తాగునీటికి 12 కలిపి 69 టీఎంసీలు అవసరంగా జిల్లా అధికారులు అంచనా వేశారు. కాగా దాదాపు నెల రోజులు ముందుగానే డ్యాంలు నిండటంతో జోన్-1కు తక్షణం నీటిని విడుదల చేసేలా ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మరో 15 రోజుల్లోపుగానే జిల్లాకు కూడా నీరు రానుంది. సాగర్‌డ్యాం నిండి గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో ఇంకా ముందుగా కూడా నీరు కాలువలకు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సాగర్ నీటిపై పూర్తి ఆశతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

టీచర్లకు 8 వరకూ సెలవుల్లేవు!

- పాఠశాల విద్య కమిషనర్ ఆదేశం
- ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

ఒంగోలు (విద్య),ఆగస్టు 4 : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికల నేపథ్యంలో ఈనెల 8 వరకూ ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయవద్దని పాఠశాల విద్య కమిషనర్ విజయరామారాజు ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్ఎంసీ ఎన్నికలకు ఈనెల 1న నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి అదేరోజు వాటిని పరిష్కరించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఈనెల 8న ఎన్నికలు నిర్వహిస్తారు. మొదట ఎస్ఎంసీ సభ్యులను ఎన్నుకుంటారు. వారు తమలో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని వైస్‌ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆతర్వాత కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ప్రధానోపాధ్యాయుడే నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలు ముగిసే వరకు టీచర్లకు సాధారణ, ఇతర సెలవులు ఏవీ మంజూరు చేయవద్దని కమిషనర్ ఆదేశించారు.

నారాయణస్వామికి భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 4: మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు అర్చకులు అభిషేకాలు చేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజల చేశారు.

విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు

మద్యం షాపుల సిబ్బందికి కాసుల పంట

కొత్త ప్రభుత్వంలోనూ మారని సిబ్బంది తీరు

పట్టించుకోని అధికారులు



అద్దంకి, ఆగస్టు 4 : మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. జగన్‌రెడ్డి హయాంలో నిర్వహించిన మద్యం షాపుల సిబ్బంది మరింత బరితెగించి అదనంగా డబ్బులు తీసుకొని బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు సైతం కాసులకు కక్కుర్తి పడి బెల్ట్‌షాపులను మరింత ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో పోలీస్, ఎస్ఈబీ అధికారులు ఒకింత దృష్టి పెట్టి బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు న మోదు చేశారు. దీంతో కొద్దిమేర గాడిలో పడింది అనుకుంటున్న తరుణంలో మరలా యథావిధిగా తెరుచుకున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో మద్యం షాపులలో పనిచేసే సిబ్బంది ఒకింత అక్రమాలు చేయడానికి ఒకింత భయపడ్డారు. అయితే ఇంకా కొత్త మద్యం పాలసీ అమలులోకి తేకపోవడంతో పాత ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది, సూపర్‌వైజర్‌లు అత్యధిక శాతం వైసీపీ నేతలు, సానుభూతి పరులే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలాగూ కొత్త పాలసీ అమలులోకి వస్తే ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండవని, అదే సమయంలో ఎలాగూ తమను మరలా ఉద్యోగాలలోకి తీసుకోరనే ఉద్దేశంతో మరింత బరితెగించి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో బెల్ట్ షాపులకు సిబ్బందే నేరుగా సరఫరా చేస్తున్నారు. ఒక్కో బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా అమ్మి డబ్బు చేసుకుంటున్నారు. దీంతో బెల్ట్ షాపులలో రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం లభిస్తోంది. ఇక బెల్ట్ షాపులను కట్టడి చేయాల్సిన ఎస్ఈబీ సిబ్బంది నెలవారీ మామూళ్లకు అలవాటు పడి మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్కో బెల్ట్ షాపు నుంచి ఎస్ఈబీ సిబ్బంది రూ.5 వేల నుంచి రూ.10వేల మేర నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 500కు పైగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. లక్షల రూపాయలను నెలవారీగా ఎస్ఈబీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. దీనిని అదనుగా చేసుకున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక్కో బాటిల్‌కు కనీసం రూ.50చొప్పున అదనంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విచ్చలవిడిగా మద్యం దుకాణాలలో మద్యం అమ్మకాలు జరుగుతుండడం, అదనంగా డబ్బులు వసూలు చేయడంపట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్యం బెల్ట్ షాపులను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బాధితుల్లో ఒకరు ఆర్టీసీ డ్రైవర్

ఆసుపత్రి వద్ద ఇరువర్గాల వాగ్వాదం

చక్కదిద్దిన పోలీసులు

చీరాలటౌన్, ఆగస్టు 4 : ఆదివారం రాత్రి చీరాల ఆర్వోబీ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌తో సహా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే ఇంకొల్లు మండలం కొనికి గ్రామానికి చెందిన పావులూరి నితిన్ చీరాల డిపో ఆర్టీసీ డ్రైవర్. అలాగే చీరాల మండలం విజయనగర్ కాలనీకు చెందిన ఉసురుపాటి అనిల్‌బాబు జియో ఫైబర్‌లో పని చేస్తున్నారు. నితిన్ విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, అనిల్ బైక్‌పై చీరాల వెళుతున్నారు. ఆర్వోబీ వద్ద ప్రమాదశాత్తు ఎదురెదురు రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న రెండు వర్గాలు హాస్పిటల్ వద్ద వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేసి చెదరగొట్టారు. దీంతో పరిస్థితి చక్కబడింది.


ప్రమాదంలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ నితిన్, అనిల్‌బాబు

సచివాలయ భవనాన్ని తెరిపిస్తాం!

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

తాళ్లూరు, ఆగస్టు 4: తురకపాలెం గ్రామ సచివాలయ భవనాన్ని తెరిపిస్తామని ఏఈఎం వెంకటేశ్వరరావు తెలిపారు. కాంట్రాక్టర్ నుంచి భవనం తాళం తీసుకొని తెరిపిస్తామని పేర్కొన్నారు. తురకపాలెం సచివాలయం వినియోగంలోకి వచ్చే నా! శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్న తాధికారులు స్పందించారు. మండల ఏఈఎం వెంకటేశ్వరరావు ఇందుకుసంబంధించి అధికారులకు నివేదించారు. గ్రామ సచివాలయ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.13 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికీ రూ.27 లక్షలు చెల్లించినట్టు చెప్పారు. కాంట్రాక్టర్‌ను అనేకమార్లు తాళం ఇవ్వమని కోరినా స్పందించలేదని, బిల్లులు రావాలని తాళం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు.



ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షిక వేడుకలు

బల్లికురవ, ఆగస్టు 4 : బల్లికురవ గ్రామంలో ఉన్న పోలేరమ్మ దేవాలయ 13వ వార్షిక వేడుకలు ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పోలేరమ్మకు గ్రామోత్సవం నిర్వహించి ప్రతి ఇంటి నుంచీ చద్దిని సేకరించి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. గ్రామస్థులు సమిష్టి కృషితో ప్రత్యేక భజనలను ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. 13 ఏళ్ల నుంచి గ్రామ దేవత అయిన పోలేరమ్మ దేవాలయ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు ఈసందర్భంగా తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..!

- శింగరకొండ దేవస్థానం ఆదాయానికి గండి
- దాతల సాయంతో రూ.30లక్షలతో దుకాణాల నిర్మాణం
- 10లో మూడింటిలోనే షాపులు
- నెలకు రూ.70వేల ఆదాయం పక్కదారి



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం .... దాతల సహకారంతో నిర్మించిన దుకాణాలు

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధిలో దాతల పాత్ర కీలకం. అయితే దాతల సహకారం తీసుకునేటప్పుడు ఉన్న శ్రద్ధ అనంతరం నిర్వహణ సమయంలో చూపకపోవడంతో ఆదాయానికి గండి పడుతుందన్న భావన భక్తులలో నెలకొంది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దక్షిణ రాజగోపురం ముందు వైపు పల్నాడు జిల్లా కోటప్పకొండ సమీపంలోని కట్టుబడిపాలెంకు చెందిన దాత ఆంజనేయులు సహకారంతో సుమారు 30లక్షల రూపాయల వ్యయంతో 10 దుకాణాలను నిర్మించి సుమారు 6 నెలల క్రితం దేవస్థానానికి అప్పగించారు. ఆ షాపులు అద్దెకు ఇచ్చేందుకు బహిరంగ వేలం పాటలు నిర్వహించి కేటాయిస్తారు. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన వేలం పాటలలో నాలుగు షాపులు మాత్రమే అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. అందులో ఓ దుకాణ నిర్వాహకుడు తాను నడుపుకోలేనని చెప్పినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుతం మూడు దుకాణాలలో మాత్రమే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మిగిలిన 7 షాపులు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో దుకాణానికి నెలకు రూ.10వేల అద్దె వచ్చే అవకాశం ఉండడంతో నెలకు 70 వేల రూపాయలు ఆదాయం కోల్పోతున్నారు. షాపులు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారాలు ముందుకు రాకపోవడానికి అసలు కారణాలు పై మాత్రం దేవాలయం అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. శింగరకొండలో దేవస్థానానికి అద్దెలు చెల్లించే దుకాణాల కంటె రెట్టింపు సంఖ్యలో ప్రైవేటు దుకాణాలు నడుస్తున్నాయి. ఎలాంటి అద్దె లేకుండా ప్రైవేటు షాపులు, తోపుడుబండ్లు నిర్వహిస్తుండడంతో పూజా సామగ్రి మొదలు అన్ని రకాల సామానులు తక్కువ ధరకే లభ్యమవుతున్నాయి. దీనికి తోడు దేవస్థానానికి అద్దె చెల్లించే దుకాణాలలో ధరల నియంత్రణ పై కూడా అధికారులు దృష్టి పెట్టకుండా ఉదాసీనంగా వ్యవహరించడం కూడా విమర్శలకు తావిస్తుంది. దీంతో ఎక్కువ మంది భక్తులు బయట వ్యాపారుల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులను తొలగింపు విషయంలో దేవస్థానం అధికారులు ఉదాసీనంగా వ్యవహరిండంతో దాతల సహకారంతో నిర్మించి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే 7 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేటు దుకాణాలను ఖాళీ చేయించి దేవస్థానం ఆధ్వర్యంలో దుకాణాలలో వ్యాపారాలు జరిగే విధంగా చర్యలు చేపట్టి దేవస్థానం ఆదాయం పెరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే దుకాణాలలో పూజా సామగ్రి మొదలు అన్ని రకాల వస్తువులను నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



తెలంగాణ నుంచి బల్లికురవకు వచ్చిన మంద

గొర్రెల మంద వలస బాట

- పొలాల పంటలు ఉండడంతో ఇక్కడకు వచ్చామంటున్న తెలంగాణ కాపరులు

బల్లికురవ, ఆగస్టు 4 : పొరుగు రాష్ట్రం నుండి గొర్రెల మందలను తీసుకుని కొందరు గత రెండు రోజుల నుండి వలస వస్తున్నారు. మా దగ్గర పంటలు సాగు చేశారని మేత లేదని అందుకే తాము ఖాళీగా ఉన్న భూములలో గొర్రెలను మేపుకొనేందుకు వచ్చామని గొర్రెల కాపరులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన గొర్రెల కాపరులు ఆదివారం పెద్ద ఎత్తున బల్లికురవ మండల కేంద్రం మీదుగా పలు గ్రామాలకు గొర్రెల మందలతో వలస వచ్చారు. రెండు మసాల పాటు గొర్రెలను మేపుకొని తిరిగి వెళతామని తమ వద్ద భూములు ఖాళీగా లేవని మాగాణి సాగు చేశారని అందుకే తాము వలస వచ్చామని కాపరులు తెలిపారు. సాగర్ కాలువ క్రింద ఉన్న భూములలో వర్షాలకు పట్టిన గడ్డిని గొర్రెలకు మేతగా మేపుకొంటామని వారు అంటున్నారు. ఒకే మారు వేల సంఖ్యలో గొర్రెలు రావటంతో ప్రజలు ఆసక్తిగా చూసి వారిని ఎక్కడి నుండి వచ్చారు అని ప్రశ్నించారు. తెలంగాణ నుండి ఆంధ్రకు వచ్చామని ఒంగోలు వరకు వెళ్లి తిరిగి స్వగ్రామాలకు వెళతామని తెలిపారు.

లారీ ఢీకొని బైకిస్టుకు గాయాలు

అద్దంకి, ఆగస్టు 4 : అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డులో రోడ్డు దాటుతున్న మోటార్‌సైకిలిస్టును లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పాతదామావారిపాలెంకు చెందిన దామా శేషగిరిరావు గత 4 దశాబ్దాలుగా ఫౌండ్రీ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం ఫౌండ్రీ వద్ద నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేషగిరిరావుకు తీవ్ర గాయాలు కాగా ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శేషగిరిరావును ఢీకొట్టిన లారీ ప్రమాదం జరిగిన తరువాత నిలపకుండా వెళ్లడంతో స్థానికులు వెళ్లి నిలుపుదల చేసి పోలీసులకు అప్పగించారు.

తహసీల్దార్‌గా నాగరాజారావు

పంగులూరు, ఆగస్టు 4 : జె.పంగులూరు తహసీల్దార్‌గా డి.నాగరాజారావు నియమితులయ్యారు. గతంలో వేమూరు తహసీల్దార్‌గా పనిచేసిన నాగరాజారావు సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లారు. తిరుపతి జిల్లా నుంచి బాపట్ల జిల్లాకు కేటాయించబడిన నాగరాజారావును జె.పంగులూరు తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులందాయి.

రేపు సర్వసభ్య సమావేశం

చినగంజాం, ఆగస్టు 4 : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు చినగంజాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణు గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఎంపీపీ అంకమ్మరెడ్డి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

లారీ-బైకు ఢీకొని ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- సంతమాగులూరులో విషాదం

సంతమాగులూరు, ఆగస్టు 4 : కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని వద్ద లారి మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన ఆదివారం జరిగింది. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన జడా బాజీ, మందలపాటి బుజ్జి ఇద్దరు బైకుపై నరసరావుపేటకు వెళ్తుండగా, నరసరావుపేట మండలం కాకాని వద్ద గుంటూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంతమాగులూరుకు చెందిన జడా బాజీ (22) తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. మందలపాటి బుజ్జి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదం సమాచారం గ్రామంలో తెలియడంతో గ్రామస్తుందరూ సంఘటనా స్థలానికి వెళ్లారు.

మనస్తాపంతో టాబ్లెట్లు మింగిన గర్భిణి

సాయికాలనీ(చీరాలటౌన్), ఆగస్టు 4 : భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా ఎనిమిది నెలల గర్భిణి ఎక్కువ మోతాదులో టాబ్లెట్‌లు మింగింది. ఈఘటన ఆదివారం రాత్రి చీరాల మండల పరిధిలోని సాయికాలనీలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సనందిస్తున్నారు.

ప్రమాదాలకు దూరంగా ఉండాలి



పర్యాటకులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ శివకుమార్

రామాపురం(చీరాలటౌన్), ఆగస్టు 4 : సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే స్నానాలు ఆచరించాలని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు. వారాంతం కావడంతో రామాపురం సముద్ర తీరానికి పర్యాటకులు సహజంగానే అధిక శాతం విచ్చేశారు. ఈక్రమంలో ఎస్ఐ సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రమాద స్థలాలను గుర్తు చేశారు. నిర్దేశిత ప్రాంతాలను మినహాయించి ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్నవారిని మందలించారు. అయనతోపాటు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

ఇంకొల్లు, ఆగస్టు 4 : మండలంలోని గొల్లపాలెంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు అమ్మవారి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో పాల్గొని వైభవంగా కొలుపులు నిర్వహించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.9లక్షల విరాళం

పర్చూరు, ఆగస్టు 4 : పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థులతోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం తమ సొంత ఊరి అభివృద్ధికి సాయం అందిస్తున్నారు. ప్రస్తు తం పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పల్లా గిరిజారాయుడు తన భర్త పెద్ద సుబ్బారాయుడు జ్ఞాపకార్థం రూ.9,00,000 లక్షల విరాళం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ప్రభుత్వ స్రత ఉద్యోగిగా విధులు నిర్వహించి ప్రస్తుతం రిటైర్డ్ అయిన కూనపరెడ్డి వీరాంజనేయులు రూ.15లక్షల విరాళం ప్రకటిస్తూ తొలివిడతగా రూ.లక్ష నగదును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత నందిస్తున్న దాతలను వారు అభినందించారు. కార్యక్రమంలో కఠారి సురేంద్రబాబు, మంగళగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహం, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న గిరిజా రాయుడు



మాట్లాడుతున్న ఎస్పీ సరిత

పట్టుదల, క్రమశిక్షణతోనే లక్ష్య సాధన

మేదరమెట్ల, ఆగస్టు 4 : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని ఎస్పీ సరిత అన్నారు. ఆదివారం కొరిశపాడు మండలం దైవాలరావూరులో కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తలదించుకుని చదివితే తలెత్తుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. అదే సెల్ ఫోన్‌లు చూస్తే జీవితాంతం తలదించుకోవాల్సి వస్తుందన్నారు. పుట్టిన ఊరును ఎవరూ మరిచిపోరాదన్నారు. రాజశేఖర్ పుట్టిన ఊరును గుర్తుంచుకుని ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పుట్టిన ఊరికి ఏదో చేయాలనే తలంపుతోనే గ్రంథాలయం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ఉద్యోగాలు ఏర్పాటుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతా మహాలక్ష్మమ్మ, శేషారెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం



ర్యాలీలో పాల్గొన్న అంబేడ్కర్ నగర్ వాసులు

మార్టూరు, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా ఇవ్వడంతో మార్టూరులోని అంబేడ్కర్ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి పెద్ద అండర్‌పాస్ వద్ద మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్‌నగర్ కాలనీలో పండుగ వాతావరణం ఏర్పడింది. కాలనీకి చెందిన అంబేడ్కర్ యూత్ యువకులు, బాబూ జగజ్జీవన్‌రామ్ అభిమానులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆనందంతో కోలాహలంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. బాణసంచాకాలుస్తూ, డప్పులు, వాయిద్యాలతో యువకులు అందరూ ర్యాలీగా కాలనీలో పర్యటించారు. వారికి ప్రతి ఇంటి నుంచీ మద్దతుగా కాలనీవాసులు సంఘీభావం ప్రకటించారు. దాదాపుగా కాలనీలోని ప్రతివీధిలో కృష్ణమాదిగ చిత్రపటాన్ని ఊరేగిస్తూ కార్యకర్తలు సందడి చేశారు. అనంతరం ఊగింపుగా పెద్ద అండరు పాస్ వద్దకు చేరి కృష్ణమాదిగ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులైన యువకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



వాటర్ ఫ్రిజ్‌ను అందజేస్తున్న కమిటీ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 4 : అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా అద్దంకిలోని సేవా స్ఫూర్తి కమిటీ (ఎస్ఎంసీ) 1989-90 బ్యాచ్ పదివ తరగతి పూర్వ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బధిరుల ఆశ్రమ పాఠశాలకు స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాలకు అవసరమైన వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతు మా పదివ తరగతి బ్యాచ్ విద్యార్థుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, స్ఫూర్తి కమిటీ పేరుతో అనేక సేవా కార్యక్రమాలను ఏళ్లుగా నిర్వహిస్తుందన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వాటర్ ఫ్రిజ్‌ను, వాటర్ బబుల్స్‌ను అందించామన్నారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతిని ఏర్పాటు చేశారు. గత 9 సంవత్సరాల నుంచి పూర్వ విద్యార్థులందరూ కలిసి పలు కార్యక్రమాలు చేసినట్లు రమేష్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు సేవా కార్యక్రమాలకు 36 లక్షలను ఖర్చు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సహకార్యదర్శి ధర్మవరపు వెంకటరావు, ట్రెజరర్ కొత్త శ్రీమన్నారాయణ, సభ్యులు బాలాజీ, పురుషోత్తం, నరహరి, శ్రీను, మురళి, ప్రసాద్, గురుశేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ధ్యాన మందిరాన్ని పరిరక్షించండి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 4 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీశ్రీశ్రీ భువనగిరి సుబ్బయ్య స్వామి ఆధ్యాత్మిక ధ్యాన మందిరాన్ని పరిరక్షించాలని పలువురు కమిటీ ప్రతినిధులు కోరారు. సుమారు 1940వ సంవత్సరంలో సుబ్బయ్య స్వామి స్థలంను ఆధ్యాత్మిక చింతన కోసం ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఇటీవల ఆ స్థలాన్ని కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని వివరించారు. ఈనేపథ్యంలో గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినా పరిష్కారం కాలేదని చెప్పారు. దీంతోనే నిరసన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. అధికారులు ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడు కున్నారు. కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలురాదా ఎడ్ల పందేలు

ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



చీరాల హరిప్రసాద్‌నగర్‌లో ఎడ్ల పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 4 : హరిప్రసాద్‌నగర్‌లోని పేరాల పోలేమర్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల పందేలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన ఎడ్ల బండిపై ఎక్కి చెర్నాకోలా ఊపుతూ అందరినీ ఉత్సాహపరిచారు. ముందుగా పోలేరమ్మ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీలు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు.

చీరాల మండలం జాండ్రపేట శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కొండయ్యను ఘనంగా సన్మానించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

వేటపాలెం మండలం రామన్నపేట చౌడేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం పందిళ్లమ్మ తల్లి పొంగళ్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీల ప్రతినిధులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో హనుమ, వాసవీమాత

శింగరకొండలో అరటిపండ్లతో పూజ

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం అరటిపండ్ల పూజ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం అభిషేకాలు నిర్వహించారు. 11 అవృత్తములుగా వేదపండితులు, అర్చకులు అరటి పండ్లతో పూజ నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆషాడమాస అమవాస్య సందర్భంగా పలు రకాల పండ్లతో అలంకరించారు. మూలమంత్ర హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలలో పాల్గొన్నారు.



పవిత్ర ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ సతీమణి శిరీష

పవిత్ర ప్రార్థనల్లో ఎంపీ సతీమణి

చీరాలటౌన్, ఆగస్టు 4 : ద్వేషాలు వీడి ఇతరుల పట్ల ప్రేమగా మెలగాలని బాపట్ల ఎంపీ సతీమణి తెన్నేటి శిరీష కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె అందరినీ ఆప్యాయంగా పలకరించి చేరువయ్యారు. అభివృద్ధి కోసం తన భర్త ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని వివరించారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే యామినీబాల, స్థానిక నాయకులు నాగేశ్వరరావు, సైమన్, సుధాకర్, రమేష్, జయకుమార్, రత్నం, శరత్ ఉన్నారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

మార్టూరు ఎస్‌హెచ్‌వో శేషగిరిరావు



మాట్లాడుతున్న శేషగిరిరావు

మార్టూరు, ఆగస్టు 4 : చట్టవ్యతిరేక పనులకు పాల్పడేవారిపై కఠిన చర్య లు తప్పవని మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్.శేషగిరిరావు హెచ్చరించారు. మార్టూరు స్టేషన్ హవుస్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన శేషగిరిరావు ఆదివారం స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమన్నారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. 14 ఏళ్ల కిందట ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన తనకు మండలంపై అవగాహన ఉందన్నారు. ఫిర్యాదులు, సమస్యలపై వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలు లేకుండా ప్రత్యేక చొరవ చూపుతామని శేషగిరిరావు స్పష్టం చేశారు.

ఏలూరి కంటి వైద్య శిబిరానికి స్పందన

- 1100 మందికి సేవలు
- 475 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సూచన




వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 4 : ప్రజా సేవే లక్ష్యంగా లక్ష మందికి కంటి చూపు అందించాలనే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వైద్య సేవలు అందిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏలూరి చారిటబుల్, నోవా ఆగ్రిటెక్ ఆధ్వర్యంలో గుంటూరు శంకరకంటి ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుంచి ప్రాంగణంలో రోగులు బారులు తీరారు. ఏలూరి ఆదేశాల మేరకు పురుషులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. 1100 మందికి పైగా రోగులకు ఉచితంగా రక్త, బీపీ, షుగర్ కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 475 మంది రోగులకు కంటి శాస్త్ర చికిత్సలకు సూచించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారకరామారావు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలందించుటలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సాటిలేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల నెలనెలా వైద్య శిబిరాలను నిర్వహిస్తూ కంటి వెలుగు ప్రదాతగా నిలిచారన్నారు. ప్రజల అభిమానాన్ని చురగొన్నారన్నారు. సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారన్నారు. లక్షమందికి కంటి చూపునందించడం లక్ష్యంగా ఏలూరి చారిటబుల్ ట్రస్టు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు మార్క్, బేతపూడి సురేష్, వీరగంధం ఆంజనేయులు, హనుమ య్య, పేర్ని బాపయ్య, ఆయోషా బుబుడే, చెరుకూరి రమేష్‌బాబు, దేవతోటి నాగరాజు, సాంబయ్య,శివయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.




రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు



● నెల్లూరు నగరం దర్గామిట్టకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేణు దగ్గు, జ్వరంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. రక్తంలో ప్లేట్లెట్‌ల కౌంట్, మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సదరు వైద్యుడు సూచించడంతో రూ.2వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. తీరా పరీక్షలలో సాధారణ జ్వరంగా నిర్ధారణ అయింది. ఇలా అవసరం లేకపోయినా రక్త పరీక్షలు పేరుతో కొందరు వైద్యులు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు.

● ఇందుకూరుపేటకు చెందిన సన్నకారు రైతు సుబ్రహ్మణ్యంకు తరచూ జలుబు చేస్తుండటంతో నెల్లూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యుడ్ని కలిశారు. లివర్‌కు సంబంధించి సిరప్ పరీక్ష చేయించుకోమని ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌కు సిఫారసు చేశారు. పరీక్ష తర్వాత లివర్‌లో ఏ సమస్య లేదని నిర్ధారణ అయింది. అయితే, ఆ పరీక్షకు మాత్రం రూ. 3 వేలు వసూలు చేశారు.

- నెల్లూరు(వైద్యం)



జలగే నయం!

వివిధ రకాల పరీక్షల పేరుతో దోపిడీ

అవసరం లేకపోయినా చేయించుకోవాల్సిందే!

ల్యాబ్‌ల్లో ఇష్టానుసారంగా పిండుడే పిండుడు!

నిబంధనలకు నీళ్లొదిలి వసూలు

ప్రతినెలా రూ.8.5 కోట్ల వ్యాపారం

వచ్చే రాబడిలో వైద్యులకూ కమీషన్

హడావుడి తప్ప వైద్య శాఖ చర్యలు శూన్యం

జ్వరం వస్తే రక్త పరీక్షలు.. కడుపునొప్పి అంటే చాలు మలం పరీక్షలు.. దగ్గు వస్తోందంటే ఉమ్మి పరీక్ష, ఎక్స్‌రే.. ఆయాసం అంటే ఈసీజీ స్కానింగ్.. తలనొప్పిగా ఉందంటే సిటీస్కాన్.. పొట్ట ఉబ్బరంగా ఉందంటే ఎండోస్కోపీ. ఇలా పరీక్షలు లేనిదే వైద్యులు రోగ నిర్ధారణ చేసే పరిస్థితి లేదు. రోగి నాడీ పట్టి రోగం ఏమిటో ఇట్టే చెప్పే వైద్యులు ఉన్నా ల్యాబ్‌లో పరీక్షలు, రిపోర్టులను పరిశీలించనిదే వైద్యం అందించడంలేదు. వైద్యులకు అందించే ఫీజుల కన్నా ఈ ల్యాబ్ పరీక్షలకే ఎక్కువ ఖర్చు అవుతోంది. ఇందులో కమీషన్ పేరిట వైద్యులు భారీ మొత్తాలను ఆశిస్తుండటంతో ఆయా ల్యాబ్ నిర్వాహకులు కూడా వైద్యులతో ఒప్పందాలు కుదుర్చుకుని రోగుల రక్తాన్ని పీల్చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్యం అందకపోవడంతో దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు వైద్యులు ఈ రకం దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న కేంద్రాలు పదుల సంఖ్యలో ఉండగా, అనుమతి లేనివి వెయ్యికిపైగా ఉన్నట్లు పలు పరిశీలనలో వెల్లడయ్యాయి.

● నెలకు 8.50 కోట్ల వ్యాపారం

జిల్లావ్యాప్తంగా 600లకుపైగా రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు ఉన్నాయి. ఇందులో వంద వరకు కార్పొరేట్ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నాయి. వీటిలో ఒక్కో ల్యాబ్‌లో వివిధ రకాల పరీక్షల పేరుతో రోజూ రూ.20వేల నుంచి 30 వేల వసూలు చేస్తుంటారు. 300 ల్యాబ్‌లలో ఒక్కో దానిలో రోజుకు రూ.4వేల నుంచి ఐదు వేల వరకు, మరో 200 ల్యాబ్‌లలో రోజుకు 500 నుంచి రూ.వెయ్యి వరకు పరీక్షల పేరిట వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ప్రతి నెల రూ. 8.50 కోట్లకుపైగా రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్క నెల్లూరు నగరంలోనే 300లకుపైగా రక్తపరీక్షా కేంద్రాలు ఉండ గా, వీటిలో 80 శాతం ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నవే. వివిధ పరీక్షల పేరుతో వైద్యులకు పర్సంటేజీల రూపం లో అందే మొత్తం భారీగానే ఉంటోంది. అవసరం లేకపోయినా హిమోగ్లోబిన్, కొలస్ట్రాల్, షుగర్, కిడ్నీ సంబంధించి బ్లడ్ యూరియాతోపాటు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు ల్యాబ్‌లలో టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేసిన వారే రక్తపరీక్షలు చేయాలి. ఇందులో అనుభవం ఉన్న వారు పెద్దస్థాయి పరీక్షలు చేయాలి. అయితే ఎటువంటి కోర్సు పూర్తి చేయని వారు కూడా కొంత అనుభవంతో పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల ఫలితాలలో అనేక పొరపాట్లు నమోదవుతున్నాయి. ఈ రిపోర్టుల ఫలితాలతో వైద్యులు చికిత్స చేస్తుండడంతో మరో వ్యాధికి గురి కావాల్సి వస్తోంది.

● ప్రభుత్వ అనుమతులు కొన్నే..

రక్తపరీక్ష కేంద్రాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే జిల్లాలో ఈ కేంద్రాలకు అనుమతులు మాత్రం వంద సంఖ్యలోనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 600లకు పైగా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం 178కి మాత్రమే అనుమతులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడిస్తోంది. నెల్లూరు నగరంతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు పట్టణాలలో వీధి వీధిన పుట్టగొడుగుల్లా పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఎప్పుడో గుర్తు వచ్చినప్పుడు మాత్రమే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించి హెచ్చరికలతో వదిలేస్తుండటంతో పరిస్థితి యథావిధిగా మారుతోంది.

రోగనిర్ధారణ పరీక్షల ఫీజుల వివరాలు (రూ.లలో)

పరీక్ష	చేయాల్సినది	చేస్తున్నది
హిమోగ్లోబిన్	45 నుంచి 100	200 నుంచి 300
హెచ్ఐవీ	100 - 150	250 - 300
హెచ్‌బీఎస్	50 - 75	150 - 250
యూరియా	45 - 80	150 - 200
షుగర్	50 - 75	250 - 300
సిరం క్రియేటిన్	40 - 70	200 - 250
పాస్పేట్	75 - 100	300 - 470
యూరిన్	50 - 75	150 - 230
డెంగ్యూ	250 - 300	800 - 2600
ప్లేట్లెట్	150 - 200	500 - 700
మలేరియా	100 - 150	300 - 350

నిబంధనలు ఇవీ..

- రక్తపరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతి తీసుకోవాలి.
- ఆయా కేంద్రాలలో ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తారో రాతపూర్వకంగా తెలియజేయాలి. అలాగే ఏ ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారో బోర్డులు కూడా ఏర్పాటు చేయాలి.
- ఏయే పరీక్షలకు ఎంత వసూలు చేస్తారో కూడా తెలియజేయాలి.
- అర్హులైన పారామెడికల్ శిక్షణ పూర్తి చేసుకున్న వారే ఈ పరీక్షలు నిర్వహించాలి.
- ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకోవాలి.




తనిఖీలు ముమ్మరం చేస్తాం



జిల్లాలోని ల్యాబొరేటరీలను ముమ్మరంగా తనిఖీ చేస్తాం. ఇప్పటికే కొన్ని ల్యాబ్‌లపై ఆరోపణలు వచ్చాయి. రక్తపరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలా చేసుకోని వారిపై తీవ్ర చర్యలుం టాయి. ఎప్పటికప్పుడు బృందాలుగా ఏర్పడి కేంద్రాలపై దాడులు నిర్వహించి, చర్యలు తీసుకుంటున్నాము. కేసులు నమోదు చేస్తున్నాము.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

- నేటి నుంచి శ్రావణమాసం
- వ్రతాలు, నోములకు ప్రత్యేకం
- పెళ్లిళ్లకు ఎంతో ప్రాధాన్యం



ముహూర్తం వచ్చేసింది!

నెల్లూరు (సాంస్కృతికం)/ పొదలకూరు, ఆగస్టు 4 : తెలుగు నెలల్లో ఐదవది శ్రావణమాసం. సోమవారం నుంచి ఈ మాసం ప్రారంభం కానున్నది. ఈ నెలను తెలుగువారు ఎంతో పవిత్రంగా భావించి వివిధ నోములు, వ్రతాలు ఆచరించడంతోపాటు వివాహాలు కూడా చేసుకుంటారు. అంతేకాక సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసంగా మహిళలు భావిస్తారు. శ్రావణశుక్రవారాల్లో లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చనలు చేస్తారు. రెండో శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. శుక్ల చవితిరోజు నాగచతుర్థిని, శుక్ల ఏకాదశిని, పుత్రఏకాదశిగా జరుపుకుంటారు. శ్రావణ పౌర్ణమిని రాఖీపౌర్ణమిగా నిర్వహిస్తూ అన్నాచెల్లెళ్లు రాఖీలు కట్టుకుంటారు. కృష్ణపక్ష అష్టమిని శ్రీకృష్ణాష్టమిగా జరుపుకుంటారు. శ్రావణ మాసం (ఆగస్టు)లో 5, 6, 7, 8, 10, 11, 12, 13, 16, 17,20, 21వ తేదీల్లో వివాహ ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ఈనెలలో వివాహ ముహూర్తాలు కుదరకపోతే నాలుగు నెలల తర్వాతే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు 6వతేదీ రాత్రి ముహూర్తానికి వేలాది వివాహాలు జరుగున్నాయి.



● మోగనున్న పెళ్లి బాజాలు!

శ్రావణమాసం ప్రారంభం కావడంతో పల్లెలు, పట్టణాల్లో పెళ్లిబాజాలు మోగనున్నాయి. మూడునెలల తర్వాత పొదలకూరు మండలంతోపాటు జిల్లాలో భారీగా పెళ్లిళ్ల జరగనున్నాయి. ప్రస్తుత ముహూర్తాల్లోనే గృహ ప్రవేశాలు, భూమి పూజలు, ఉపనయనాలు, బారసాల వంటివి జరగనున్నాయి. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపేది వివాహ వేడుకలే.

ఉద్యాన రైతులకు ఊరట

- బిందు, తుంపర్ల సేద్యం యూనిట్ల కేటాయింపు
- రూ.76.57కోట్లతో 10,500హెక్టార్లలో అమలు లక్ష్యం

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 4 : ఉద్యాన రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సూక్ష్మసేద్యా నికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. 45 నుంచి 90 శాతం వరకు రాయితీపై అవసరమైన పరికరాలను అందజేయనున్నది. ఈ క్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉద్యానశాఖలు సమన్వయం చేసుకుంటూ ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.

● కూటమి ప్రభుత్వంతో కదలిక

గత ప్రభుత్వం ఉద్యాన రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. బిందు, తుంపర్ల సేద్యం పరికరాలకు తూట్లు పొడిచింది. వీటి సరఫరా సంస్థలకు బకాయిల చెల్లించకపోవడంతో ఆయా సంస్థలు పరికరాలను అందించేందుకు ముందుకు రాలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉద్యాన రైతులకు అండగా నిలిచేలా ప్రణాళికలు రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాయితీ, రైతువాటాతో సూక్ష్మసేద్యా నికి పరికరాలను అందించే ప్రక్రియ ప్రారంభమైంది. స్థానిక రైతుసేవాకేంద్రాల్లో బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించిన పరికరాల కోసం ఉద్యాన రైతులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చింది.

ఆర్ఎస్‌కేలో నమోదు చేసుకోండి



జిల్లాలో రూ.76.57కోట్లతో 10,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల పథకం అమలుకు లక్ష్యాలను నిర్దేశించారు. రాయితీని పొందేందుకు రైతులు ఆధార్‌కార్డు, భూమి యాజమాన్య పత్రం జతచేసి సమీపంలోని రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)లో ఉన్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఇంకా ఏదైనా అనుమానాలుంటే 0861-231 5779 నెంబరును సంప్రదించాలి.

- శ్రీనివాసులు, పీడీ, ఏపీఎంఐపీ

● బకాయిల చెల్లింపునకు పచ్చజెండా

2022-23లో జిల్లాలో 2,600 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం కాగా, అధికారులు 3424.74 హెక్టార్లకుగాను రూ.25.07కోట్ల విలువైన పరికరాలను అమర్చారు. అప్పటి ప్రభుత్వం కేవలం రూ.4.17కోట్లు మాత్రమే చెల్లింపులు చేసింది. రూ.20.9కోట్ల మేర బకాయిలున్నాయి. అలాగే 2023-24లో 3500 హెక్టార్లు లక్ష్యం కాగా, 2654.26 హెక్టార్లకు సంబంధించి రూ.19.9కోట్ల మేర పరికరా లను అమర్చారు. అయితే ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం రాగానే 2022-23కి సంబంధించిన బకాయిల్లో దాదాపు రూ.13.04కోట్ల చెల్లింపులకు పచ్చజెండా ఊపింది. రాయితీ నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది.

బిందు సేద్యానికి సంబంధించి హెడ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



● 10,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం

2024-25 సంవత్సరానికి ఉద్యాన పంటల అభివృద్ధికి 10,500 హెక్టార్లలో పథకం అమలుకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ముఖ్యంగా నిమ్మ, మామిడి, బత్తాయి, జామ, బొప్పాయి, మిరప, పువ్వులతోపాటు కూరగాయలు, పూలమొక్కల సాగుకు బిందు సేద్య పరికరాలు అందించనున్నారు. అలాగే మినుము, వేరుశనగ, పెసర తదితర పంటలకు తుంపర్ల సేద్య పరికరా లను రైతులకు రాయితీపై అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఐదుఎకరాల వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90శాతం బిందు సేద్యం, 55శాతం తుంపర్ల సేద్య పరికరాలు, 5 నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు 70శాతం బిందు సేద్యం, 45శాతం రాయితీపై తుంపర్ల సేద్య పరికరాలు అందించనున్నారు.

ముంపు పేరుతో దోపిడీ

నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డబ్బు రుచి మరిగిన దళారులు తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ)ను వదిలి పోవడం లేదు. కండలేరు ముంపు భూముల పేరిట జరుగుతున్న దోపిడీని గతేడాది 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసింది. ఈ క్రమంలో అప్పటి జేసీ విచారణ కూడా జరిపి రూ.కోట్ల అక్రమాలు జరిగాయని నిర్ధారించారు. దీంతో అప్పటి నుంచి టీజీపీ భూసేకరణ కార్యాలయాల వైపు దళారులు రావడం మానేశారు. అయితే మళ్లీ ఇప్పుడు వారు ప్రజాధనం కొల్లగొట్టేందుకు స్కెచ్ వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇటు జిల్లా కేంద్రంలోనూ, అటు రాష్ట్ర రాజధానిలోనూ, అధికారుల ను బుట్టలో వేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని భూముల పరిహారాలకు సంబంధించి దస్త్రాలు జిల్లాలో కదులుతున్నాయి.



నెల్లూరులోని తెలుగుగంగ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టరు కార్యాలయం

● భారీగా ప్రణాళికలు

కండలేరు ముంపు గ్రామాల్లోని సీజేఎఫ్ఎస్, డీకేటీ భూముల పేరిట రూ.వందల కోట్ల పరిహారం కొట్టేసేం దుకు భారీ ప్రణాళికలు రూపొందుతున్నాయి. గత 32 ఏళ్ల క్రితం కండలేరు ప్రాజెక్టుకు ఈ భూములను తీసుకోగా, ఇప్పుడు ఆ భూములకు పరిహారం కావాలంటూ కొంతమంది నుంచి అర్జీలు అందుతున్నాయి. వీటిని ఇద్దరు బ్రోకర్లు అధికా రులకు అందజేస్తూ మేనేజ్ చేస్తున్నారు. 1992లో తీసుకున్న భూములకు ఇప్పుడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలంటూ పావులు కదుపుతున్నారు. ఇది చట్ట విరుద్ధమని తెలిసినా టీజీపీ రాపూరు యూనిట్ అధికారులు కొత్త రిక్విజిషన్ పంపాలంటూ ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయడం చర్చనీయాంశ మైంది. 2013 భూసేకరణ చట్టం అమల్లోకి రాకముందు వరకూ సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములకు ప్రభుత్వం నిర్దిష్ట పరిహారం చెల్లించేది కాదు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పరిహారం చెల్లిస్తూ వచ్చింది. 2013 నుంచి పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తున్నారు. అయితే కండలేరు ముంపు గ్రామాల్లో వందల ఎకరాల సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు న్నాయి. ఈ భూములను కండలేరు ప్రాజెక్టుకు తీసుకుంటూ 1992 నుంచి 2013 వరకు పలు దఫాలుగా అప్పటి ఇరిగేషన్ అధికారులు రిక్విజిషన్ పంపడం, దాన్ని ప్రభుత్వం ఆమోదిం చడం జరిగింది. ఇప్పుడు ఆ భూములకు కొత్త చట్టం ప్రకారం పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. రాపూరు మండలం గుండవోలు నుంచి తొలుత 30 ఎకరాలకు సంబంధించి అర్జీలు పెట్టి వాటికి తొలుత ఫ్రెష్ రిక్విజిషన్ తెచ్చేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ వెంటనే మరో 120 ఎకరాలకు ఇదే మాదిరిగా పెట్టేందుకు సన్నాహాలు జరుగు తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం కూడా ఇదే మాదిరిగా అర్జీలు వచ్చినప్పటికీ.. ఎప్పుడో 1992లో ఇచ్చిన రిక్విజిషన్‌కు మళ్లీ కొత్తగా రిక్విజిషన్ ఇవ్వడం సాధ్యపడదని అప్పటి ఇరిగేషన్ అధికా రులు స్పష్టం చేశారు. కొత్తగా భూములు ముంపునకు గురవుతు న్నాయని అర్జీలు అందితే.. తొలుత భూసేకరణ విభాగం అధికారులు ఆ భూములను గతంలో రిక్విజిషన్ కింద తీసుకుని ఉన్నారా..? లేదా..? అన్నది పరిశీలిస్తే తేలిపోతుంది. అది పక్కన పెట్టి ఎప్పుడో కండలేరుకు తీసుకున్న భూములకు ఇప్పుడు కొత్తగా రిక్విజిషన్ పంపాలంటూ ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

చర్యలు తీసుకోకపోవడమే కారణం

గూడూరుకు చెందిన ఓ లాయర్, నెల్లూరుకు చెందిన మరో లాయర్‌లు ముంపు బాధితుల మాటున రూ.కోట్లు కూడబెట్టుకున్నట్లు ఆరోపణలున్నాయి. అవినీతికి అలవాటు పడిన పలువురు అధికారులు ఈ పాపంలో భాగం పంచుకుంటూ వచ్చారు. ఇటీవల టీజీపీలో జరిగిన అక్రమాల బాగోతం బయటపడుతూ వస్తోంది. నెల్లూరు జిల్లాలో అసలు దానిమ్మ సాగు జరగదు. ఇది ఎవరిని అడిగినా చెబుతారు కానీ, ఇప్పటి వరకూ దానిమ్మ చెట్లకు పరిహారం పేరుతో దాదాపు రూ.400 కోట్లు చెల్లించారంటే అతిశయోక్తి కాదు. ఇంకా అనేక కేసులు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో నడుస్తున్నాయి. అదే మాదిరిగా కలువాయి మండలం పెరంకొండ గ్రామం మాటున కూడా దాదాపు రూ.100 కోట్లు చెల్లించారు. అసలు ముంపు ప్రాంతం కాకపోయినా ఆ గ్రామంలోని భూములకు, ఇళ్లకు పరిహారం, గ్రామస్థులకు ఆర్అండ్ఆర్ కింద పరిహారం చెల్లించారు. ముంపు గ్రామాలన్నీ ఖాళీ అయినా ఇంకా పెరంకొండ గ్రామం అలానే ఉంది. దీన్ని చూసిన ప్రతీ ఒక్కరూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఇక ఈ గ్రామంలో నిర్మాణాలకు జరిపిన పరిహారంలో భారీ కుంభకోణం జరిగింది. దాదాపు రూ.33 కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టారు. ఇందులో ఓ లాయర్ కీలకంగా వ్యవహరించి తనతోపాటు కొందరు ఉన్నతాధికారులకు పంచిపెట్టారు. ఈ దానిమ్మ చెట్లు, పెరంకొండ కుంభకోణాలపై గతేడాది అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. తెలుగుగంగ భూసేకరణ విభాగంలో భారీగా అక్రమాలు జరిగాయని నిర్ధారించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సీబీఐ విచారణ జరపాలని సిఫార్సు చేశారు. ఈ అవినీతి బాగోతాలు చూసి విస్తుపోయిన నాటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు.. అసలు టీజీపీ భూసేకరణ విభాగాన్ని మూసేయాలని ప్రభుత్వానికి నివేదించారు. నాడు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఇప్పుడు మళ్లీ పరిహారం మాటున దోపిడీకి సిద్ధమయ్యారు.

- టీజీపీలో మళ్లీ మొదలైన దళారుల హవా
- పరిహారం కోసం దొడ్డిదారిన కదులుతున్న ఫైళ్లు
- 32 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములకు ఇప్పుడు పరిహారమట!
- సీజేఎఫ్ఎస్, డీకేటీ మాటున రూ.కోట్లు కొట్టేసే కుట్ర
- భూసేకరణ, ఇరిగేషన్ కార్యాలయాల్లో హడావుడి
- ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడమే కారణం

కొత్త భూములకు మాత్రమే పరిహారం

గతంలో రిక్విజిషన్ ఇచ్చి ఉన్న భూములకు ఇప్పుడు పరిహారం ఇవ్వడం కుదరదు. గతంలో పరిహారం చెల్లించకపోతేనే కొత్తగా పరిహారం చెల్లిస్తాం.

- ప్రేమ్‌కుమార్, టీజీపీ రాపూరు యూనిట్ ఎస్‌డీసీ

ఫ్రెష్ రిక్విజిషన్ ఇవ్వమన్నారు

గుండవోలు గ్రామానికి సంబంధించి ముంపునకు గురైన భూముల వివరాలను ఇవ్వాలంటూ భూసేకరణ విభాగం నుంచి లేఖ వచ్చింది. ముంపునకు గురైన భూముల వివరాలు మాత్రమే అందిస్తాం.

- సత్యప్రసాద్; టీజీపీ ఒకటో డివిజన్ ఈఈ

ఎక్సైజ్‌లో సెబ్ విలీనం?

- కొత్త మద్యం పాలసీ దిశగా ప్రభుత్వం అడుగులు
- పొరుగు రాష్ట్రాల్లో పరిశీలన
- అక్టోబరు ఒకటి నుంచి అమలు

నెల్లూరు,(క్రైం),ఆగస్టు 4: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలన్నర పూర్తయింది. గతంలో ఉన్న మద్యం బ్రాండ్లు ఇంకా దుకాణాల్లోకి రాలేదే..? ఇంకా ఎన్నాళ్లు ఇలా క్యూలో నిల్చొని మద్యం కొనుగోలు చేయాలి... మద్యం కోసం రూ. వేలకు వేలకు ఇంకా ఎంతకాలం బార్లకు చెల్లించాలి.. ? అనే ఆవేదనలో మందుబాబులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకు వస్తుందా..? ఇప్పుడున్న పాలసీనే కొనసాగుతుందా..? అన్న అనుమానాలు కూడా వారిలో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నది. అక్టోబరు ఒకటి నుంచి కొత్త మద్యం పాలసీ అమలుల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నది.



● ఇతర రాష్ట్రాల్లో పరిశీలన

నూతన మద్యం పాలసీని రూపొందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 12 మందితో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిం ది. రాజస్థాన్‌కి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కి ముగ్గురు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రా లకు ముగ్గురు, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ముగ్గురు చొప్పున అధికారులను కేటాయించింది. ప్రతీ కమిటీలోనూ డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని ఒకరు ఉంటారు. రెండు రోజుల్లో ఈ కమిటీలు వారికి కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి అక్కడున్న మద్యం పాలసీలను పరిశీలిస్తారు. లోటుపాట్లను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి వేరుచేసిన సెబ్‌ను తిరిగి ఎక్సైజ్‌లో విలీనం చేస్తారా... లేదా అనే అంశంపై మరో 19 మందితో కమిటీని నియమించింది. మందుబాబులకు మంచి బ్రాండ్ల మద్యం, మద్యం కోసం ఇబ్బందులు పడకుండా చూడడంతోపాటు ప్రభుత్వానికి మద్యం అమ్మకాల ద్వారా వచ్చే రెవెన్యూను సైతం దృష్టిలో ఉంచుకొని కమిటీలు ప్రణాళికలను సిద్ధం చేయనున్నాయి.

● అక్టోబరు నుంచి అమలు

అక్టోబరు ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి రానున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ మద్యం దుకా ణాలను తొలగించి, గతంలోలా వైన్‌షాపులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. ఈ క్రమంలో కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీల్లో వైన్ షాపుల టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందన్న సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. లక్కీడిప్ ద్వారా దుకాణాలను కేటాయిస్తారా...? టెండర్ల ప్రక్రియను బార్లకు నిర్వహించినట్లు ఆన్‌లైన్‌లో వైన్‌షాపులకు కూడా నిర్వహిస్తారా...? ఇలా అనుమానాలు వ్యాపారుల్లో ఉన్నాయి. గతంలో వైన్ షాపులు నిర్వహించే వారంతా ప్రస్తుతం నూతన పాలసీ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏది ఏమైనా ఈ నెలాఖరుకల్లా మద్యం పాలసీపై ఓ స్పష్టత వస్తుందని అంతా భావిస్తున్నారు.

శ్లాబ్ కుంగింది..

ఇనుప చువ్వలు తేలాయి!

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు
- నాడు-నేడు కింద మరమ్మతులకు మాత్రమే నిధుల మంజూరు
- నూతన భవనాలు నిర్మించాలని తల్లిదండ్రుల డిమాండ్
- ఇదీ గండిపాలెం మెయిన్ స్కూల్ దుస్థితి



శిథిలావస్థకు చేరిన గండిపాలెం పాఠశాల భవనాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 4: గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులను పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడడంతో పాటు కొన్ని గదుల్లోకి చెట్ల వేర్లు చొచ్చుకొచ్చి స్లాబు కుంగిపోయింది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40మంది విద్యార్థులున్నా పాఠశాలలో ప్రస్తుతం వరండాలు, చెట్ల కింద ఉపాధ్యాయులు విద్యాబోధన చేపడుతున్నారు.



దెబ్బతిన్న తరగతి గది కాంక్రీట్ బీమ్

● నిధులు మంజూరైనా నిష్ప్రయోజనమే..

నాడు-నేడు కింద తొలి విడతలో రూ.12లక్షలు, రెండోవిడతలో రూ.16 లక్షలు పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల దుస్థితిని చూసిన కాంట్రాక్టర్లు వీటికి మరమ్మతులు చేయలేం.. వాటిని పడ గొట్టి నూతన తరగతి భవనాలు నిర్మించాలని తేల్చారు. అయితే ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో రెండు విడతల్లో మరమ్మతులకు మాత్రమే నిధు లు మంజూరు చేయడం, నూతన గదుల నిర్మాణానికి నిధు లు మంజూరు చేయకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● అద్దె గదిలోకి మార్చేందుకు యత్నాలు..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భవనాలు కూలిపోతాయో అని తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపేందుకు జంకుతున్నారు. ఈ విషయం ఎంఈవో మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం ఆయన గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో గ్రామంలో పలు నివాసాలను పరిశీలించి అక్కడ పాఠశాల నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

- షేక్ మస్తాన్‌వలి, ఎంఈవో, ఉదయగిరి

గండిపాళెం మెయిన్ పాఠశాల దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాల మరమ్మతులకు నాడు-నేడు పథకంలో రెండుసార్లు నిధులు మంజూరైనా భవనాల దుస్థితి చూసి మరమ్మతులు చేపట్టలేదు. ప్రస్తుతం పాఠశాల భవనాలు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో పాఠశాల నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మూఢ విశ్వాసాలు పారదోలాలి

కావలిటౌన్, ఆగస్టు 4: శాస్త్రీయ విజ్ఞానంతో మూఢ విశ్వాసాలు పారదోలాలని చాంధస భావాలను అరికట్టాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనం సమావేశ మందిరంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జేవీవీ వార్షిక సమావేశంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ రవికుమార్, డాక్టర్ శివప్రసాద్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఏది మంచిదో ఏది చెడ్డదో ప్రజలను చైతన్యవంతులు చేసే బాధ్యత విజ్ఞానవంతులదే అన్నారు. కార్యక్రమంలో గాదిరెడ్డి హరనాథ్, సుబ్బరాయశర్మ, జానికిరామ్, మాధవ, సీ శారద పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

బిట్రగుంట: బోగోలు పంచాయతీలోని హరిజనవాడ పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆషాడమాస ఆదివారాన్ని పురస్కరించుకుని మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అంతకుముందు ఉదయం అభిషేక కార్యక్రమాలు, అర్చకులు సూర్యనారాయణరెడ్డి బృందం సభ్యులు మధ్యాహ్నం చండీయాగం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన ఉభయకర్తలుగా కుందుర్తి బాబు, సునీత దంపతులు, అన్నసంతర్పణలో కుందుర్తి వరప్రసాద్, శ్రీనివాసులు, వెంకటరమణ దంపతులు, చండీయాగంలో ఇనగంటి నాగేశ్వరావు ఆయన ధర్మపతి ఉభయకర్తలుగా వ్యవహరించారు.



జెండా ఊపి 3కే రన్ ప్రారంభిస్తున్న మాజీ గౌవర్నర్ దేవరాల సుబ్రహ్మణ్యం

3కే రన్ ప్రారంభం

బిట్రగుంట, ఆగస్టు 4: బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి 3కే రన్ పోటీలు సంఘం అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభం అయ్యాయి. 4వందల మందికిపైగా ఈ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్యులు విజయేంద్ర, చంద్రశేఖర్, చలపతి హాజరైయారు. ఇటీవల మృతి చెందిన వాకర్స్ సభ్యుడు చీకుర్తి మధు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజేతలకు మెమోంటోలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, ఫౌండర్ ప్రెసిడెంట్ కుందుర్తి శ్రీనివాసులు అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు పొంగళ్లు

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంటలో కనకదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అంతకు ముందు తెలవారుజామున అమ్మవారిని గ్రామ శివారు పోలేరమ్మ ఆలయ ప్రాంగణ సమీపంలోని పొల్లాలోకి చేర్చారు. గ్రామస్తులు కాయాకర్పూర హారతులు, నైవేద్యాలు సమర్పించారు. స్థానిక నేతల రావి విజయ్‌కుమార్, కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరా వు, స్థానిక టీడీపీ నేతలు వేడుకల్లో పాల్గొన్నారు.

ఆత్మకూరుకు పూర్వవైభవం తీసుకువస్తా : మంత్రి ఆనం



ఆత్మకూరు: మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు, ఆగస్టు 4: ఆత్మకూరు పట్టణానికి పూర్వ వైభవాన్ని తీసుకవస్తా వస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రా మనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో మంత్రి పర్యటించారు. ముందుగా మున్సిపల్ ప్రజలకు తాగునీరు తాగునీటి శుద్ధిజల కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పదేళ్ల క్రితం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడినా ఇప్పటికీ ఆస్థాయి అభివృద్ధికి నోచుకోలేదని విచారకరం వ్యక్తం చేశారు. ఆత్మకూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినపుడు భవిష్యత్ అవసరాల దృష్యా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.100కోట్లతో తాగునీటి వసతి కల్పించామన్నారు. ఆత్మకూరు ప్రజలకు 20ఏళ్ల పాటు తాగునీటి ఎద్దడి లేకుండా చూసేందుకు రూ.9.04కోట్ల అమృత్ నిధులతో తాగునీటి పథకం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.22.81కోట్ల బీపీఎస్ నిధులతో మున్సిపాలిటీలోని మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టాల్సి ఉందన్నారు. మురుగునీటిని శుభ్రం చేసేందుకు ఐదు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.3.18 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులు మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. నెల్లూరుపాళెం అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి పట్టణంలోకి వచ్చే రెండు ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. బైపాస్ రోడ్డులో వాకింగ్‌కు వీలుగా వాకింగ్ ట్రాక్, డివైడర్లు, రోడ్డుకిరువైపులా లైటింగ్ పనులు చేపడతామన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు నిలిచిన ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయ నిర్మాణ పనులను పూర్తిచేయిస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసు కోవాలని సూచించారు.

కొలగాని రామయ్య చౌల్ట్రీ ఆక్రమణపై చర్యలు

ఆత్మకూరు నడిబొడ్డులోని కొలగాని రామయ్య చౌల్ట్రీని కొందరు కబ్జా చేసి దుకాణాలు, భవనాలు నిర్మించారని, వీటి తొలిగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో అర్హులైన పేదలను గుర్తించి వారికి వేరే ప్రదేశంలో స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అక్కడక్కడ షాపింగ్ మాల్ నిర్మించి దుకాణదారులకు గదులు కేటాయిస్తామని తెలిపారు. పట్టణంలో మంజూరైన ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను తాత్కాలికంగా ఏపీ ఎస్సీ గురుకుల పాఠశాల సెకండ్ ఫ్లోర్‌లో ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆయన ఆత్మకూరులోని ఎస్సీ గురుకుల పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆత్మకూరు ఆర్డీవో మధులత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, కమిషనర్ షేక్ ఫజులుల్లా, వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, వెంకటయ్య, ఆత్మకూరు ఉప సంచాలకులు శ్రీదేవి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి : సీఐటీయూ

కందుకూరు, ఆగస్టు 4: గ్రామ, వార్డుస్థాయిలో చిరుద్యోగులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కమిటీ బాధ్యులు జీవీబీ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ వలేటివారిపాలెం, ఉలవపాడు మండల కమిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగులైన అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ పెద్దలు ఓవైపు ఎవరిపైనా కక్షసాధింపులు వద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, వేధింపులు ఆపకపోతే చిరుద్యోగులందరినీ సమీకరించి ఉద్యమించక తప్పదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సాధు చెన్నకేశవులు, వాకా లతారెడ్డి, ఎస్కే నూర్జహాన్, చిమటా శ్రీను, నక్కా కోటేశ్వరరావు, జాన్, చంద్రకుమారి, లక్ష్మీరాజ్యం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవివేకా డిగ్రీ కాలేజీలో మెగా జాబ్‌మేళా

● ఉద్యోగాలకు 54మంది ఎంపిక



జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల నిర్వాహకులు

కందుకూరు, ఆగస్టు 4: పట్టణంలోని శ్రీ వివేకా డిగ్రీ కాలేజీలో ఆదివారం బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిన కళాశాలేతర విద్యార్థినీ విద్యార్థులకు కూడా ఈ జాబ్‌మేళాలో పాల్గొనే అవకాశం కల్పించగా 156 మంది జాబ్‌మేళాలో పాల్గొన్నారు. టెక్ మహీంద్రా, సదర్లాండ్, టెలీ పెర్ఫార్మెన్స్ తదితర కంపెనీలు హాజరై 54మందిని ఉద్యోగాలకు ఎంపికచేసుకున్నట్లు విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, జి బాలభాస్కరరావు, బి నరేంద్రబాబు, అబ్బూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన కందుకూరి



మంత్రి ఆనంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కందుకూరి

కావలి, ఆగస్టు4: రాష్ట్రదేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి కందుకూరి వెంకటసత్యనారాయణ ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం కావలి నియోజకవర్గంలోని బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి పనుల గురించి, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రితో చర్చించారు.

పాఠశాలల పరిసరాల్లో మద్యం విక్రయాలు

కావలి రూరల్, ఆగస్టు4: బడికి, గుడికి సమీపంలో ఎలాంటి మద్యం అమ్మకాలు చేపట్టరాదన్న నిబంధనలను తుంగలో తొక్కి కావలి మండలం పేపాలవారిపాలెం, అడవిలక్ష్మీపురం గ్రామాల్లోని పాఠశాలల పరిసరాలల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుదుకాణాలు నిర్వహించారు. పేపాలవారి పాలెంలోని పాఠశాలకు సమీపంలో ఏర్పాటు చేసిన మూడు దుకాణాలతోపాటు అడవిలక్ష్మీపురంలోని పాఠశాల పక్కనున్న కూల్‌డ్రింక్ షాపులో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేతల సహకారంతో పాఠశాలలకు సమీపంలో పోటీ పడి మద్యం అమ్మకాలు సాగిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

స్కాలర్‌షిప్‌నకు ముగ్గురి ఎంపిక

కందుకూరు, ఆగస్టు 4 : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం. నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కే జోయల్‌సుధాకర్, కే. కేతన్, బీ. రామకృష్ణలు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని, వీరికి ఐదేళ్లపాటు ప్రతి ఏటా రూ. 12వేలు నగదు ప్రోత్సాహకం కేంద్రప్రభుత్వం నుంచి అందుతుందని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేయండి

కొండాపురం, ఆగస్టు 4: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల వైద్యశాలగా అభివృద్ధి చేయాలంటూ బీజేపీ మండలాధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున ఆదివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో 45 వేలమంది జనాభా ఉన్నా మెరుగైన వైద్యం లేక 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. అలాగే నీటిలో ఫ్లోరిన్ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఎక్కువగా అనారోగ్యాలకు గురవుతున్నాట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని 30పడకల వైద్యశాలతో నూతన భవన నిర్మాణం, వైద్యాధికారులతో పాటు సిబ్బందికి క్వార్టర్లు, స్టాఫ్ నర్సులు, సెక్యూరిటీని ఏర్పాటు చేసి 24గంటలు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సపోర్టు స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉదయగిరి నాగులబావివీధిలో విద్యుత్ స్తంభం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 4: స్థానిక నాగులబావివీధిలో ఒరిగి కూలేదశలో ఉన్న విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌ కో అధికారులు సపోర్టుగా మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గతనెల 21న ఆంధ్రజ్యోతిలో పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ ఖుద్దూస్‌బాషాలు స్పందించి స్తంభాన్ని పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



సీతారామపురం: కుర్వవీధి కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

సీతారామపురం. ఆగస్టు 4: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ఆదివారం సీతారామపురం పంచాయతీలోని కురవవీధిలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడారు. పారిశుధ్యం మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ప్రతి వీధిలోని కాలువల్లో దోమల నిర్మూల మందును పిచికారీ చేయించాలని, ఫాగింగ్‌తో పాటు ఆయిల్‌బాల్స్ వేయాలని, ప్రధాన కాలువలతో పాటు వీధి కాలువల్లో సకాలంలో పూడికతీత పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల పంపిణీ

అనంతసాగరం, ఆగస్టు 4: మండలంలోని శంకరనగరం, రేవూరు, లక్ష్మరాజుపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ సభ్యులు కృష్ణయ్య, కొండయ్య, పెంచలయ్య త్రైత సిద్ధాంతపై ప్రచారం నిర్వహించి గ్రంథాలను పంపిణీ చేశారు.

సయ్యద్ అబ్దుల్ ఖాదర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



గంధాన్ని దర్గాకు తీసుకవస్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 4: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా ఉత్సవంలో భాగంగా భక్తులు ఆదివారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు స్వామికి భక్తిశ్రద్ధలతో జప్పేచిరాగి పాతెహా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఖాదరీయ అస్థానం నుంచి అధ్యక్షుడు అహమ్మద్‌బాషా ఆధ్వర్యంలో భక్తులు మేళతాళాలు, ఫకీరు జరు బులతో ఊరేగింపుగా గంధాన్ని ఖాన్‌సాహెబ్ దర్గాకు తీసుకొచ్చారు. చదివింపుల అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. అస్థానంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దర్గా నిర్వాహకులు రాత్రి కి ఖవ్వాలీ పాటకచేరీ నిర్వహించారు.

బాల చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



కడవబాణం గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



అలంకరణలో బాల చౌడేశ్వరిదేవి

సంగం, ఆగస్టు 4: స్థానిక రాళ్లచెలిక, కొత్తూరులోని బాల చౌడేశ్వరిదేవి జయంతిని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాళ్లచెలికలోని ఆలయంలో అమ్మవారికి డిస్కో అలంకరణ చేపట్టి ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కొత్తూరులో సాయంత్రం నిర్వహించిన కడవ బాణం గ్రామోత్సవం భక్తులను అలరించింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించారు.

బుద్ధుడి అష్టాంగమార్గం ఆదర్శనీయం..

వింజమూరు, ఆగస్టు 4: బుద్ధుడు చెప్పిన అష్టాంగా యోగ మార్గమే మానవ జీవితానికి ఆదర్శనీయమని దాన్ని ఆచరిస్తే ఎప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవిస్తూ మోక్షానికి అర్హులవుతామని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్ నన్నూరి వాసంతి అన్నారు. ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో జరిగిన సజ్జన సాంగత్యంలో ఆమె ప్రసంగించారు. అనంతరం శాఖాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ పిరమిడ్ నగర్, వైశ్యబజార్, కుమ్మరిబారు, ఎర్రబెల్లిపాలెం, ప్రధాన రహదారుల మీద మహాకరుణ కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తిరుపతిరావు, జానకిరామిరెడ్డి, సుబ్బారెడ్డి, చిన్న, వెంకటరెడ్డి, హేమలత, సుప్రజ, సీత, కౌసల్య, శాంతమ్మ, రేణుక, స్వరాజ్యం, కృష్ణవేణి పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా సమాచార బోర్డు

వరికుంటపాడు, ఆగస్టు 4: మండల కేంద్రంలోని వైద్యశాలలో ఏర్పాటు చేసిన సమాచార బోర్డు అలంకారప్రాయంగా దర్శన మిస్తుందని స్థానికులు, వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు ఎపుడు వస్తారో, ఎపుడు పోతారో తెలియడం లేదంటున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. వైద్యశాల సమాచార బోర్డులో ఉద్యోగుల పేర్లు, ఫోన్ నంబర్లను నమోదు చేయలేదు.



టీడీపీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపునివ్వండి

● ఎంపీ వేమిరెడ్డికి మోషే విజ్ఞప్తి

కందుకూరు, ఆగస్టు 4: గత ఐదేళ్లలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నకాలంలో పార్టీకోసం కష్టపడ్డ వారిని గుర్తించి వారికి నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం ఇవ్వాలని ఆపార్టీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని కలిసి వినతిపత్రం ద్వారా కోరినట్లు మోషే తెలిపారు. పార్టీకోసం కష్టపడ్డవారికి పదవులు ఇవ్వాలనే ఆలోచనలో సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నారని తెలిసిందని, అలాంటివారికి నెల్లూరు పార్లమెంటు పరిధిలో నావంతు సహకారం అందిస్తానని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి హామీ ఇచ్చారని మోషే పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సీ సెల్ నాయకులు దువ్వూరి రమేష్‌చంద్ర తదితరులున్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

లింగసముద్రం, ఆగస్టు 4 : ఈనెల 8వ తేదీన జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు అన్నారు. ఆదివారం సాయంత్రం లింగసముద్రంలోని టీడీపీ కార్యలయంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ అధ్యక్షతన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని టీడీపీ నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులను, ప్రిన్సిపాళ్లను కలిసి ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. టీడీపీ నాయకుడు సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ హెచ్‌ఎంల దగ్గర ఓటర్ల జాబితాలను తీసుకొని ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్ నారాయణ, ఎ చిన కొండయ్య కిలారి కొండయ్య, ఎ పెదసత్యం, బింకం శేషయ్య, జంపాల కృష్ణయ్య, అడపా కృష్ణ, బొజ్జా శ్రీను, ఉట్లపల్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈహెచ్ఎస్ సేవలు సక్రమంగా అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, ఆగస్టు 4: విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్ఎస్ క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులు అనుమతించటం లేదని, ఆ సేవలు సక్రమంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ కందుకూరు తాలూకా శాఖ గౌరవాధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు(ఆర్‌వీ) కోరారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్రంలో టీడీపీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటి రెండు తేదీలలోనే జీతాలు, పెన్షన్లు వారి ఖాతాలలో జమచే యటం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో అనేక డీఏ బకాయిలు చెల్లించకుండా అప్పటి ప్రభుత్వం అన్యాయం చేసిందని భవిష్యత్తులో ఆ బకాయిలు చెల్లిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పెన్షనర్లు విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా బుద్ధసమాజం ప్రతినిధి గాండ్ల హరిప్రసాద్ మరణానంతర నేత్రదానం, అవయవదానం ఆవశ్యకతను వివరించగా పలువురు పెన్షనర్లు నేత్రదానంకు అంగీకరించారు. ఈ సమావేశంలో పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు చిమ్మిరి నరసింహం, ఇంటూరి మాల్యాద్రి, చెన్నయ్య, కృష్ణారావు, శ్రీనివాసులు, గణపతిరాజు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

కొండాపురం, ఆగస్టు 4: కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు ఆదివారం సాయిపేటలో ప్రచారం నిర్వహించారు. దేవుడు అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటామని కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ తెలిపారు. పూర్వం శ్రీకృష్ణాష్టమిని 11 రోజులపాటు నిర్వహించి చివరగా చవితిరోజు ఊరేగింపు ముగించేవారన్నారు. అలాగే త్రైతసిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల, ధర్మప్రచారం నిర్వహించారు. జి.పెంచలయ్య, కె.న రసింహులు, ఎంనాగమ్మ, కె.వెంకటసుబ్బమ్మ, డి..రమణయ్య, టి.మాలకొండారెడ్డి, ఎం.సరోజ నమ్మ పాల్గొన్నారు.

కాటంగారి శెట్టి మృతి బాధాకరం: ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, ఆగస్టు 4: టీడీపీ మత్స్యకార సీనియర్ నాయకుడు కాటంగారి శెట్టి (80) మృతి చెందడం బాధాకరం అని కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం తూర్పుతీర ప్రాంతమైన తాటిచెట్లపాలెంకు చెందిన ఆయన అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, మాజీ ఆప్కాప్ ఛైర్మన్ కొండూరు పాలిశెట్టి, పైడేరు మాజీ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ బీద గిరిధర్, నెల్లూరు పార్లమెంటరి మత్స్యకార అధ్యక్షుడు పామంజి శేషయ్యలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

మైత్రి దినోత్సవంలో పూర్వ విద్యార్థులు

● మొక్కలు నాటిన స్నేహితులు



మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

కావలి టౌన్, ఆగస్టు 4: స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అంతర్జాతీయ మైత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మద్దూరుపాడు ప్రాంతంలో సమావేశమై వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థి రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్ మాట్లాడారు. తమ స్నేహితుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత పీ మురళీకృష్ణ నెల్లూరు కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులు, స్థానికుల సహకారంతో పెన్నా నది తీరంలో వేలాది మొక్కలు నాటించారని గుర్తు చేశారు. అతని స్ఫూర్తి, సూచనల మేరకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అందుబాటులోనున్న స్నేహితులు ప్రతి ఆదివారం విశ్వోదయ పాఠశాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పూర్వ విద్యార్థి, సహచర మిత్రులు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పట్టణంలో 31వేల చెట్లు పెంచాలన్న సంకల్పానికి మద్దతుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దూబగుంట రవికుమార్, సాయిబాబ రోసిరెడ్డి, ద్రోణాదుల వెంకట్రావు, సత్యప్రసాద్ పాల్గొన్నారు.